



# విజయభాను





విశాఖపట్నం, బుధవారం 27-09-2023 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 48 సంచిక : 16 పేజీలు : 08 వెల : 1 రూపాయి





## పనితీరు ఆధారంగానే
# టికెట్లు కేటాయిస్తాం

- వచ్చే ఎన్నికల్లో 175 సీట్లకు 175 సీట్లు గెలవాలనే లక్ష్యం
- మనం గేర్ మార్చాల్సిన అవసరం వచ్చింది
- వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమం చేపట్టబోతున్నాం
- మొత్తం ఐదు దశల్లో జగనన్న సురక్ష కార్యక్రమం

### పార్టీ నేతలతో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంపై సమీక్ష

తాడేపల్లి (విజయభాను న్యూస్) : వచ్చే ఎన్నికల్లో 175 సీట్లకు 175 సీట్లు గెలవాలనే లక్ష్యంతో పని చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి పార్టీ నేతలకు సూచించారు. అలాగే పనితీరు ఆధారంగానే టికెట్లు కేటాయిస్తామని తేల్చిచెప్పేశారు. 175కి 175 సీట్లు గెలవడం అసాధ్యం ఏమీ కాదని, కచ్చితంగా గెలుస్తామనే ధీమా వ్యక్తం చేశారు సీఎం జగన్. మంగళవారంతాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ నేతలతో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు సీఎం జగన్. ఈ మేరకు పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కో-ఆర్డినేటర్లు, పార్టీ రీజినల్ ఇంచార్జులు హాజరయ్యారు.

మనం గేర్ మార్చాల్సిన అవసరం వచ్చింది

'ఇప్పటివరకూ మనం చేసిన కార్యక్రమాలు ఒక ఎత్తు.. రాబోయే కాలంలో చేపట్టే కార్యక్రమాలు మరో ఎత్తు. వచ్చే 6 నెలలు ఎలా పనిచేస్తామన్నది చాలా ముఖ్యం. మనం గేర్ మార్చాల్సిన అవసరం వచ్చింది. మన పార్టీ, ప్రభుత్వం పట్ల సానుకూల స్పందన చూశారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలి. క్షేత్రస్థాయిలో సానుకూల పరిస్థితులు ఉన్నాయి. ఒంటరిగా పోటీ చేయలేక ప్రతిపక్షాలు పొత్తులకు వెళ్తున్నాయి. మన పార్టీ, మన ప్రభుత్వం పట్ల

తరువాయి 2లో..

# ఏపీలో ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

### రాష్ట్రపతిని కోరిన లోకేశ్



దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్.. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కోరారు. మంగళవారం తెదేపా ఎంపీలు కేశినేని నాని, గల్లా జయదేవ్, రామ్మోహన్ నాయుడు, కనకమేడల రవీంద్రకుమార్‌లతో కలిసి లోకేశ్ రాష్ట్రపతిని కలిశారు. తెదేపా అధినేత చంద్రబాబు అరెస్టు విషయాన్ని ఈ సందర్భంగా రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లారు. జగన్ పాలన, ప్రతిపక్షాల అణచివేతపై రాష్ట్రపతికి వివరించారు. రాష్ట్రపతితో భేటీ అనంతరం లోకేశ్ మీడియాతో మాట్లాడుతూ.. "2019 నుంచి ఏపీలో ప్రతిపక్షాలపై జరుగుతున్న అరాచకాలను రాష్ట్రపతికి వివరించాం. తెదేపా నేతలపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిన అంశాలను వివరించారు. 45 ఏళ్ల ప్రజాజీవితంలో ఉన్న చంద్రబాబును స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో జైలుకు పంపించారని వివరించాం. మా వద్ద ఉన్న ఆధారాలన్నింటినీ రాష్ట్రపతికి అందజేశాం. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారు. యువగళం పాదయాత్ర తిరిగి ప్రారంభిస్తానని నిన్న ప్రకటించిన తర్వాత.. నన్ను ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో ఇరికించారు.

ఇన్నర్ రింగ్‌రోడ్డు,

తరువాయి 2లో..

# గత 30 రోజుల్లో..
# 85 మంది ప్రపంచ నేతలను కలిశా



దిల్లీ: గత 30 రోజుల్లో భారత దౌత్యం సరికొత్త శిఖరాగ్రాలను అందుకుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ వ్యవధిలో తాను 85 మంది ప్రపంచ నేతలను కలిసినట్లు చెప్పారు. జీ20 సదస్సు లో భాగంగా తీసుకున్న కొన్ని నిర్ణయాలు.. 21వ శతాబ్దపు ప్రపంచ దిశను మార్చే శక్తి కలిగి ఉన్నాయని తెలిపారు. విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులను, వివిధ వృత్తుల్లోని యువ నిపుణులను అనుసంధానం చేసేందుకు దిల్లీలోని 'భారత్ మండపం'లో ఏర్పాటు చేసిన 'జీ20 యూనివర్సిటీ కనెక్ట్ తుది వేడుకను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. 'అంతర్జాతీయంగా భిన్న పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో.. ఇన్ని దేశాలను ఒకే వేదికపైకి తీసుకురావడం చిన్న విషయం కాదు' అని ఇటీవలి జీ20 సదస్సును గుర్తుచేస్తూ ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. దేశ అభివృద్ధి ప్రయాణం కొనసాగాలంటే.. స్పష్టమైన, స్థిరమైన పాలన అవసరమని స్పష్టం చేశారు. చంద్రయాన్-3 విజయాన్ని ప్రస్తావిస్తూ.. ఆగస్టు 23 'జాతీయ అంతరిక్ష దినోత్సవం'గా దేశ చరిత్రలో నిలిచిపోయిందన్నారు. గత 30 రోజుల్లో భారత దౌత్యం కొత్త శిఖరాలకు చేరుకుందని తెలిపారు. జీ20 సదస్సు దిల్లీ కేంద్రీకృత కార్యక్రమమే అయినప్పటికీ.. భారత్ దీన్ని దేశవ్యాప్త ఉద్యమంగా మలిచినట్లు చెప్పారు. భారత్ చొరవతో బ్రిక్స్ కూటమిలో కొత్తగా ఆరు దేశాలు చేరినట్లు ప్రధాని మోదీ తెలిపారు. 'దిల్లీ డిక్లరేషన్'పై ఏకాభిప్రాయం ప్రపంచ హెడ్‌లైన్‌లలో నిలిచిందన్నారు. గత నెల రోజుల్లో పేదలు, ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలు, మధ్యతరగతి వర్గాల సాధికారత కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. పీఎం విశ్వకర్మ యోజన, రోజ్‌గార్ మేళా, కొత్త పార్లమెంటు భవనంలో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడం వంటివి ప్రస్తావించారు. "ఆశావాదం, అవకాశాలు, స్వేచ్ఛగా అభిప్రాయాలు వ్యక్తపరచగలిగే చోటే యువత రాణిస్తుంది. 'గొప్పగా ఆలోచించండి..' ఇదే యువతకు నా సందేశం" అని ప్రధాని మోదీ అన్నారు.

# నెరవేరిన ఉత్తరాంధ్ర భక్తుల చిరకాల డిమాండ్

- ఫలించిన ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కృషి
- విశాఖపట్నం - వారణాసి రైలుకు ఆమోదం తెలిపిన రైల్వేశాఖ
- ఉత్తరాంధ్ర ప్రయాణికులు వినియోగించుకోవాలని పిలుపు



న్యూ ఢిల్లీ/శ్రీకాకుళం(విజయభాను న్యూస్): శ్రీకాకుళం: ఉత్తరాంధ్ర భక్తుల చిరకాల డిమాండ్ నేరవేరిందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. విశాఖపట్నం - వారణాసి మధ్య తొలి రైలుకు ఆమోదం లభించిందని ప్రకటించారు. ఈ మేరకు రైల్వేశాఖ జారీ చేసిన ఉత్తర్వులపై హర్షం వ్యక్తం చేస్తూ..

తరువాయి 2లో..

## అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో నారా లోకేశ్ పేరు



విజయవాడ: అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పేరును సీఐడీ చేర్చింది. ఈ మేరకు కేసులో ఆయన పేరును చేరుస్తూ నేడు ఏసీబీ కోర్టులో మెమో దాఖలు చేసింది. ఈ కేసులో లోకేశ్ పేరును చేర్చేందుకు ఉన్న ఆధారాలేంటి? ఏ కోణంలో చేర్చారు? తదితర విషయాలను సీఐడీ వెల్లడించాల్సి ఉంది. సీఐడీ మెమోపై న్యాయమూర్తి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. గతంలో ఇదే కేసులో తెదేపా అధినేత చంద్రబాబు, మాజీ మంత్రి నారాయణ పేర్లను సీఐడీ చేర్చింది. నారాయణ ముందస్తు బెయిల్ పొందారు. ఈ కేసులోనే చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఇవాళ మధ్యాహ్నం హైకోర్టులో విచారణ జరగనుంది.






# రోజ్ ఘర్ మేళాలు లక్ష్యం 10 లక్షల ఉపాధి




### - కేంద్ర సహాయ మంత్రి నారాయణ స్వామీ

విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత్ దేశం విశేష అభివృద్ధి సాధిస్తుందనీ కేంద్ర సాంఘిక న్యాయం,సాధికారతశాఖ సహాయ మంత్రి మంత్రి నారాయణ స్వామీ అన్నారు. విశాఖ లోని కైలాస పురం లో గల సాగర మాల కన్వెన్షన్ సెంటర్ లో మంగళ వారం జరిగిన 9 వ రోజ్ ఘూర్ మేళా ను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ,దేశ వ్యాప్తంగా 51 వేల మందికి పై గా 45 ప్రాంతాల్లో నియామక పత్రాలు అందజేస్తున్నారు. దేశంలో మూడో అతి పెద్ద విభాగం తపాలా శాఖ అన్నారు. చంద్రయాన్ విజయవంతం తో ప్రపంచ దేశాలు భారత్ దేశం వైపు చూస్తున్నాయి అన్నారు. ఇది ఇంజనీర్లు, శాస్త్ర వేత్తలు విజయంగా అభివర్ణించారు. ప్రపంచ

తరువాయి 2లో..

# పోలీస్, ప్రభుత్వ తీరుపై నిరసన

## మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడిన పాలన పై పోరాటం ఆగదు




అనకాపల్లి జిల్లా నర్సీపట్నం : అంగన్వాడీలపై ప్రభుత్వం అణచివేత, మానవహక్కుల ఉల్లంఘన పై ప్రభుత్వం పై పోరాటం ఆగదని నర్సీపట్నం లో నిరసన తెలిపారు. నిన్న విజయవాడలో జరిగిన పోలీసులు,ప్రభుత్వ తీరుకు నిరసనగా అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు అంగన్వాడీ కార్యకర్తలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు.అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్లు (ఏఐటీయూసీ) అనుబంధ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు నవర మణి, రొంగల సత్య ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తమ భావ ప్రకటన స్వేచ్ఛను ప్రభుత్వం హరించటం దారుణమైన చర్యగా పేర్కొన్నారు. విజయవాడలో పోలీసులు అత్యుత్సాహంతో మహిళలను కదలనియకుండా చేయడం దారుణమైన దుర్మార్గమైన చర్యగా వారు పేర్కొన్నారు. మూడు సంవత్సరాలుగా టిఏ డిఏ బిల్లులు ఇవ్వడం లేదని, ప్రతినెలా జీతాలు అందడం లేదని, కనీస వేతనం అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని వారు ఆరోపించారు. నిన్న పోలీసులు తీరుకు నిరసనగా ఈరోజు నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు చిన్నారి, బుచ్చంపేట నుండి మంగ, ఎర్రయమ్మ, కొత్త మల్లంపేట నుండి రాజేశ్వరి, సంఘం జిల్లా అధ్యక్షులు యమ్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.డికేఎస్ఎస్ జిల్లా అద్యక్షులు చిట్ల చలపతి సంఘీభావం తెలిపారు.

## బీసీ కుల గణన బిల్లు శుభపరిణామం

– పిళ్ళా సుజాతసత్యనారాయణ



మధురవాడ (విజయభాను న్యూస్) : గత ప్రభుత్వాలు నగరాల సామాజిక వర్గం పై వివక్ష చూపాయని రాష్ట్రం మొత్తం మీద రెండు లక్షల పైగా ఉన్న జనాభాను కేవలం 50 వేలగా మాత్రమే చూపించి అందవలసిన నిధులు, సంక్షేమ పథకాల కోత విధించి నగరాల సామాజిక వర్గానికి ఇంతవరకు అన్యాయం చేశారని నగరాలు కార్పొరేషన్ ఛైర్పర్సన్ పిళ్ళా సుజాతసత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేసారు. దీనిని దృష్టిలో పెట్టుకుని గతంలో అనేకసార్లు బీసీ కుల గణన చేసి నగరాలు సామాజిక వర్గానికి న్యాయం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అలాగే బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ, ప్రభుత్వ పెద్దల దృష్టికి, ఉత్తరాంధ్రలో పర్యటించిన బీసీ కమిషన్ కి విజ్ఞప్తి చేశామని అందుకు అనుగుణంగా మనగలవారం శాసనసభలో వెనకబడిన కులాలకు కులగణన అంశాన్ని ప్రవేశపెట్టడంపై హర్షం వ్యక్తం చేస్తూ నగరాలు కార్పొరేషన్ తరపున ధన్యవాదాలు తెలియజేసారు.

## పారిశుధ్య పనులును పరివేక్షిస్తున్న సర్పంచ్ చింతకాయల



పరవాడ :-పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం పంచాయతీ ,ముత్యాలమ్మపాలెం దిబ్బపాలెం గ్రామాలలో గ్రామ సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు ఆధ్వర్యంలో పారిశుధ్యం డ్రైనేజీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.. ఈ పారిశుధ్య పనులను మంగళవారం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు దగ్గరుండి పర్యవేక్షించారు.. ఈ కార్యక్రమం లో మండల కోఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న,మాజీ ఎంపిటీసి చింతకాయల అమ్మోరు, మాజీ కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు

## ప్రజల ఆరోగ్యానికి రక్ష.. జగనన్న సురక్ష

### పరవాడలో శర వేగంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



పరవాడ:- వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది గాను సీఎం జగన్మోహన్ రెడ్డి నూతనంగా పేద ప్రజల కోసం ఆరోగ్య సురక్ష అనే కార్యక్రమానికిశ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే.. దీంట్లో భాగంగా మంగళవారం పరవాడ లో జగనన్న సురక్ష సర్వే శర వేగంగా నిర్వహించారు. పరవాడ పి హెచ్ సి వైద్యాధికారి డాక్టర్ రంజిత్ ఆదేశాల మేరకు ఏఎన్ఎం రత్నం వైద్య సిబ్బందితో ఇంటింటికి వెళ్లి ప్రజల యొక్క ఆరోగ్య పరిస్థితిలు తెలుసుకుంటున్నారు.. అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.. షుగర్, బిపి, క్యాన్సర్, గుండె, కిడ్నీ సంబంధిత దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులతో పాటు, గర్భిణీలు, చిన్నారులు,బాలింతలు ఆరోగ్య వివరాలు నమోదు చేస్తున్నారు.. ఉన్నతాధికారులు ఈ సర్వే ని పరివేక్షిస్తున్నారు.. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు అక్కడికక్కడే వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు... ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది స్థానిక వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు..

## విద్యుత్ మీటర్లకు ఆధార్‌లింక్ చర్యలు ఉపసంహరించండి

విశాఖపట్నం **(విజయభాను న్యూస్)** : రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ మీటర్లకు ఆధార్‌లింగ్ పెట్టేందుకు విద్యుత్ వినియోగదారులపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నది. ఈ చట్ట వ్యతిరేక చర్యను సిపిఐ(ఎం) విశాఖ జిల్లా వ్యతిరేకిస్తున్నది. తక్షణం ఈ వినాశకర చర్యలను ఉపసంహరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తున్నది. గత కొన్ని రోజులుగా ప్రతి ఇంటికి విద్యుత్ ఉద్యోగులు వెళ్ళి ఆధార్ నెంబర్లు ఇవ్వమని వత్తిడి చేస్తున్నారు. ఆధార్ నెంబర్ విద్యుత్ మీటర్‌కు లింకు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయమని చెబుతున్నారు.ఆధార్ నెంబర్ ఇవ్వకపోతే విద్యుత్ కనెక్షన్ తొలగిస్తామని భయపెడుతున్నారు. వాస్తవంగా ఓటరు కార్డుకి ఆధార్‌లింక్ కేంద్ర బిజెపి ప్రభుత్వం తప్పని సరిగా ప్రయత్నం చేసింది. సుప్రీంకోర్టు ఈ చర్యను తిరస్కరించింది. యిది చట్ట వ్యతిరేకమని కూడా చెప్పింది. ఆధార్‌లింక్ అనేది ఓటరు ఐచ్ఛికమని కూడా తీర్పు చెప్పింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిదానికి ఆధార్ లింక్ ముడిపెట్టి ప్రజలను బెదిరిస్తున్నది. ఆస్తిపన్నుకు, స్కీములకు కూడా ఆధార్‌లింక్ పెట్టారు. ప్రజల సదుపాయాలు, స్కీములు కుదించటానికే ఆధార్‌లింక్ చర్యకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాల్పడుతున్నాయని సిపిఐ(ఎం) తెలియజేస్తున్నది.

## జిల్లా స్థాయి క్రీడాపోటీలలో సి బి ఎం బీ జీ ఎం స్కూల్ విద్యార్థులు ఎంపిక



భీమునిపట్నం : విజయబాను న్యూస్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు నిర్వహించిన పోటీలలో జిల్లా స్థాయి పోటీలకు సిపిఎం ఎయిడెడ్ హై స్కూల్ బిజీయం ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఎంపికయ్యారని స్కూల్ సూపర్ రెండెంట్. పిఏ విజయ్ కుమార్ తెలిపారు అండర్ 14 మరియు అండర్ 17 విభాగంలో 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారు ఈనెల 27 తారీఖున ఎలమంచిలి జడ్పీహెచ్ఎస్ కొత్తపేట లో జరగబోవు జిల్లాస్థాయి పోటీలు అనగా బాల్ బ్యాడ్మింటన్ త్రో బాల్ షటిల్ బ్యాడ్మింటన్ లకు ఎంపికయ్యారని ఆమె తెలిపారు ఎంపిక కాబడిన విద్యార్థులను విజయం స్కూల్ కరస్పాండెంట్ పిఎస్ చందు మరియు సిపిఎం ఇంచార్జ్ హెచ్ఎం ఎం సారా శాంతి పి ఈ టి రాంబాబులు అభినందించారు.

## పి.బోనంగి లో లేగ దూడలు ప్రదర్శన



పరవాడ:-పరవాడ మండలం పాయకరావు బోనంగి ( పి. బోనంగి ) గ్రామం నందు పరవాడ సబ్ డివిజన్ ఏరియా వెటర్నరీ సహాయ సంచాలకులు డాక్టర్ రామకృష్ణ కీర్తి ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన ఘనంగా జరిగింది. ఈ యొక్క కార్యక్రమాన్ని విశాఖపట్నం జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ బి రామ్మోహన్రావు పర్యవేక్షించారు... ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పి.బోనంగి గ్రామ సర్పంచ్ బండారు కల్పనా రాజశేఖర్ హాజరయ్యి వాళ్ల చేతులు మీదుగా ప్రారంభించారు..కృత్రిమ గర్భాధారణ మరియు లింగ నిర్ధారణ వీర్య నాలికలను సబ్సిడీ ద్వారా రైతుల వినియోగించుకోవాలని నేటి లేక దూడలే రేపటి పాడి పశువులని అన్నారు.. రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ లేగ దూడల పోసన యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు.

ఈ యొక్క కార్యక్రమం ద్వారా మేలు జాతి మరియు మంచి ఆరోగ్యకరమైన లేగ దూడలను ఎంపిక చేసి మొదట, రెండవ మరియు మూడవ బహుమతులను రైతులకు అందజేయడం జరిగింది.. ఈ కార్యక్రమానికి హాజరైన రైతులందరి లేగ దూడలకు బహుమతులతో పాటు మిశ్రమ దాన,టానిక్ మరియు మందులను పంపిణీ చేశారు.. మొత్తం 54 లేగ దూడలు ప్రదర్శనలో పాల్గొనడం జరిగింది.. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు డాక్టర్ అశ్విని ప్రపుల్ల, డాక్టర్ పి. సురేష్ కుమార్ మరియు పశు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పనితీరు ఆధారంగానే టికెట్లు కేటాయిస్తాం

సానుకూల అంశం చూశాం. ఇదే ఆత్మవిశ్వాసంతో అడుగులు ముందుకేయాలి' అని సూచించారు సీఎం జగన్. 'అసెంబ్లీ నియోజకవర్గాల్లో విభేదాలు లేకుండా చూసుకోవాలి. మనమంతా ఒక కుటుంబంలోని సభ్యులమే. టికెట్లు ఇవ్వనంత మాత్రాన నిరాశ వద్దు. కొందరికి టికెట్లు ఇవ్వొచ్చు.. మరికొందరికి ఇవ్వకపోవచ్చు. మరో అవకాశం కల్పిస్తాం' అని సీఎం జగన్ స్పష్టం చేశారు.

వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమం చేపట్టబోతున్నాం

ప్రజల్లో ఎవరికి ఇస్తే కరెక్ట్ అనే ప్రాతిపదికన నిర్ణయాలు తీసుకోవచ్చు. టికెట్ ఇవ్వనంత మాత్రాన వాళ్లు నా వాళ్లు కాకుండాపోరు. టికెట్లపై ప్రతి ఒక్కరూ నా నిర్ణయాలను పెద్ద మనసుతో స్వాగతించాలి. టికెట్లు రాని వారికి మరొక అవకాశం కల్పిస్తాం. లీడర్, పార్టీ మీద నమ్మకం ఉండాలి. సర్వేలు కూడా తుది దశలోకి వస్తున్నాయి. చివరి దశ సర్వేలు కూడా జరుగుతాయి. ప్రజల్లో ఎక్కువగా ఉంటే మంచి ఫలితాలు. ప్రతి ఒక్కరూ ప్రజలతో మమేకమై ఉండాలి. వచ్చే నెలల్లో చేపట్టే కార్యక్రమాలు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం, వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమం చేపడతాం' అని తెలిపారు సీఎం జగన్.

మొత్తం ఐదు దశల్లో జగనన్న సురక్ష కార్యక్రమం

జగనన్న సురక్ష కార్యక్రమం వల్ల చాలా పాజిటివ్ వచ్చింది. దాదాపు 98 లక్షల సర్టిఫికెట్లు ఇచ్చాం. అర్హులకు అవసరమైన సర్టిఫికెట్లను జారీ చేశాం.ఇప్పుడు ఆరోగ్య సురక్ష చేపడుతున్నాం. ఆరోగ్య పరంగా ప్రతి ఇంటిని జల్లెడ పడతాం. ఉచితంగా మందులు, పరీక్షలు చేస్తాం. గుర్తించిన వారికి మెరుగైన చికిత్సలు అందిస్తాం. విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో చేయూతనిస్తాం. ఇందులో ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులను మమేకం చేస్తాం.మొత్తం ఐదు దశల్లో జగనన్న సురక్ష కార్యక్రమం. తొలి దశలో వాలంటీర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి వివరిస్తారు.రెండో దశలో ఏఎన్ఎంలు, సీహెచ్ఓలు, ఆశా వర్కర్లు ప్రతి ఇంటికి పరీక్షలు చేయడానికి వెళ్తారు. మూడో దశలో వాలంటీర్లు, గృహ సారథులు ప్రజా ప్రతినిధులు క్యాంపు వివరాలు తెలియజేస్తారు. నాల్గో దశలో క్యాంపులను ఏర్పాటు చేస్తారు. ఐదో దశలో అనారోగ్యంతో ఉన్న వారిని గుర్తించి వారికి నయం అయ్యే వరకూ చేయూతనిస్తారు' అని సీఎం జగన్ పేర్కొన్నారు.

## రోజ్ ఘర్ మేళాలు లక్ష్యం 10 లక్షల ఉపాధి

దేశాలకు భారత్ ఆదర్శంగా నిలవాలి అని ఆకాంక్షించారు. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత బీజేపీదే అన్నారు. పీ ఎం విశ్వ కర్మ యోజన పథకం చిన్న వృత్తి కళాకారులకు ఎంతో మేలు చేస్తాయని అన్నారు. ఎస్సీ ఎస్టీ లకు కూడా ఉపయోగ పడుతుంది అన్నారు. ఉపాధి కల్పన కు ప్రధాని మోడీ ప్రాధాన్యత ఇస్తున్నారు అన్నారు. ఈ ఏడాది చివరి నాటికి 10 లక్షల మందికి ఉపాధి కల్పన లక్ష్యం గా వుంది అన్నారు. తపాలా శాఖ విశాఖ డివిజన్ పోస్ట్ మాస్టర్ జనరల్ బీ.రాములు మాట్లాడుతూ, విశాఖలో 163 మందికి ఆరు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు వచ్చాయి అన్నారు. తపాలా శాఖలో 119 ఉద్యోగాలు వచ్చాయి అన్నారు. ఇప్పటి వరకు 8 రోజ్ ఘర మేళాలు జరిగాయి అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కస్టమ్స్ చీఫ్ కమిషనర్ రుషి గోయల్, జీ ఎస్ టి చీఫ్ కమిషనర్ ఎం ఆర్ ఆర్.రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ప్రధాన మంత్రి వీడియో సందేశం తిలకించారు. అనంతరం కేంద్ర మంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు.

## ఏపీలో ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

ఫైబర్ గ్రిడ్, స్కిల్ డెవలప్‌మెంట్‌తో నాకేంటి సంబంధం. ఇన్నర్ రింగ్‌రోడ్డు లేకపోయినా కేసు ఎలా పెట్టారో అర్థం కావట్లేదు. ఢిల్లీలో ప్రతిపక్ష పార్టీల నేతలను కలిసి ఏపీలో అరాచకాలపై వివరించాం. రోజుకో వదంతి, రోజుకో కేసులతో వేధిస్తున్నారు. తప్పకుండా రిటర్న్ గిఫ్ట్ ఇచ్చే బాధ్యత తీసుకుంటా. ఈ ప్రభుత్వం దొంగ కేసులు పెట్టి మమ్మల్ని వేధిస్తోంది.

కేసులకు సంబంధించి ప్రభుత్వం వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. కేసు పెట్టాక అధారాలు ఇవ్వాలని సీఐడీ అధికారులు కోరుతున్నారు. కక్ష సాధింపు తప్ప ఒక్క కేసులోనూ చంద్రబాబు పాత్ర లేదు. నాకు, మా కుటుంబ సభ్యులకు ఒక్క పైసా రాలేదు. ఆయా కంపెనీల వద్ద ఒక కప్పు టీ కూడా తాగ లేదు" అని లోకేశ్ స్పష్టం చేశారు.


## నెరవేరిన ఉత్తరాంధ్ర భక్తుల చిరకాల డిమాండ్

ఆయన ఢిల్లీ నుంచి మంగళవారం సందేశం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కింజరాపు మాట్లాడుతూ... ప్రతి హిందువు జీవితంలో ఒక్కసారైనా కాశీ విశ్వనాథుని దర్శించుకోవాలని ఆశ పడుతుంటారని తెలిపారు. అయితే నేరుగా రాకపోకలు సాగించే రైలు లేకపోవడం.. భువనేశ్వర్ లేదా రాయపూర్ నుంచి మరో రైలు మారాల్సి రావడంతో వృద్ధులు, మహిళలు ప్రయాణాన్ని విరమించుకోవాల్సి వచ్చేదని విచారం వ్యక్తం చేశారు. దీనికి చెక్ పట్టేలా విశాఖ – వారణాసి ని అనుసంధానం చేస్తూ రైలు నడపాలని రైల్వేమంత్రి అశ్విన్ శ్రీవైష్ణవ్, తూర్పుకోస్తా రైల్వే జోనల్, డివిజన్ సమావేశాల్లో భేటీ అయి డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రైల్వేశాఖ స్పందించి, రైలు నడిపేందుకు ఉత్తర్వులు జారీ చేయడంపై ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ రైలు సేవలతో ఇరు ప్రాంతాల మధ్య ఆధ్యాత్మిక, పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే... రానున్న రోజుల్లో వారంలో ప్రతి రోజూ నడిచేలా రైల్వేశాఖ చొరవ చూపాలని కోరారు.

వారంలో రెండు రోజులు..

ప్రస్తుతం సంబలపూర్ – వారణాసి మధ్య నడుస్తున్న (18311 / 18312) రైలు ఇకపై విశాఖపట్నం నుంచి ప్రారంభం కానున్నదని ఎంపీ రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. విశాఖపట్నంలో ప్రతి బుధ, ఆదివారాల్లో ఉదయం 4.10 గంటలకు, వారణాసిలో సోమ, గురువారాల్లో మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరనుందని తెలిపారు. 28 గంటల్లో నేరుగా గమ్యాన్ని చేరుకునే ఈ రైలు అందుబాటులోకి రావడంతో ఎంతో సమయం, డబ్బు కూడా ఆదా అవుతుందని సంతృప్తి వ్యక్తం చేశారు. విశాఖపట్నం, కొత్తవలస, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ మీదుగా సంబలపూర్, వారణాసి చేరుకునే ఈ రైలును ఉత్తరాంధ్ర ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## స్వగ్రామమైన బూర్జ లో పర్యటించిన ఎంపీపీ శెట్టి నీలవేణి



అనంతగిరి విజయభాను న్యూస్ : అనంతగిరి, ఎంపీపీ ఎంపీపీ శెట్టి నీలవేణి తన స్వగ్రామమైన హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ కేంద్రంలో మంగళవారం పర్యటించారు. అక్కడ తన తండ్రి, ysrcp మాజీ మండల అధ్యక్షుడు శెట్టి ఆనంద్ తరపు బంధువుల తో పాటు, గ్రామంలోని అన్ని వీధుల్లో పర్యటించి స్థానికులతో ఆప్యాయంగా పలకరించారు.ఎన్నో ఏళ్ళ తర్వాత ఆమె ఎంపీపీ హోదాలో వెళ్ళడం తో వారు ఆమెను ఎంతో ఆప్యాయత గా దగ్గరకు తీసుకున్నారు. అదేవిధంగా బూర్జ ఎంపీటీసీ హరి ని ఆయన గ్రామం అయిన మజ్జివలసలో మర్యాదపూర్వకం గా కలిశారు.అనంతరం హుకుంపేట మండలం గత్తుమ్ పంచాయతీ సర్పంచ్ పాడి పోతురాజు అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి pacs మాజీ చైర్మన్ పాడి కృష్ణ మూర్తి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన




ఆంధ్రవిశ్వవిద్యాలయం **(విజయభాను న్యూస్)** : ఆంధ్రవిశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చైర్ ఆద్వర్యంలో ఆయుష్మాన్ హార్ట్ సెంటర్ సహకారంతో నిర్వహించిన ఉచిత గుండె పరీక్ష వైద్యశిబిరం విజయవతం అయ్యింది. ఏయూ ఆచార్యులు, బోధనేతర సిబ్బంది పెద్దసంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేసుకున్నారు. ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ గరికపాటి మహేష్ ఆధ్యర్యంలో నిపుణులైన వైద్యసిబ్బంది ఏయూ ఉద్యోగులకు రక్తపరీక్షలు, ఈసిజి, ఎకో, బిపి పరీక్షలు నిర్వహించి వైద్యులు అవసరమైన చికిత్స విధనాలు, సూచనలు అందించారు. కార్యక్రమాన్ని అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జేమ్స్ స్టీఫెన్ సమన్వయం చేసారు.

## విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కీలక వ్యాఖ్యలు



విశాఖపట్నం: విశాఖ స్టీల్‌ప్లాంట్ పై బీజేపీ ఎంపీ జీవీఎల్ కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం నాడు విశాఖలో జీవీఎల్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..“స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఇప్పుడప్పుడే జరగదు. స్టీల్‌ప్లాంట్‌ను లాభసాటిగా నడిపించాలనేదే మా ప్రయత్నం. స్టీల్‌ప్లాంట్ సంబంధిత అంశాలపై పార్లమెంట్‌లో ప్రశ్నించాం. 10 నుంచి 15 ప్రశ్నలను నేనే అడిగాను. ప్లాంట్?కు అవసరమయ్యే ఐరన్ ఓర్ కోసం.. గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు?. స్టీల్‌ప్లాంట్‌ను యాజమాన్యం పట్టించుకోలేదు. లాభాల్లో ఉందనేది వాస్తవం కాదు. గతంలో ఎన్నో తప్పిదాలు జరిగాయి. మోదీ ప్రభుత్వాన్ని నిందించడం సరికాదు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఒక ట్రాక్‌లో పెడతాం” అని ఎంపీ జీవీఎల్ పేర్కొన్నారు.

## ఆగని నిరసనలు




మధురవాడ (విజయభాను న్యూస్) చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. చంద్రబాబును వెంటనే విడుదల చేయాలంటూ పాదయాత్రలు, కొవ్వొత్తుల ర్యాలీలు, కాగడాల ర్యాలీలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భాగంగా మంగళవారం ఎండాడ లో పెద్ద ఎత్తున కాడగల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో టీడీపీ, జనసేన పార్టీలు తో పాటుగా పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. అనంతరం శాఖరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్ర లో జరుగుతున్న అన్యాయాలు ప్రజలందరు గమనిస్తున్నారని హెచ్చరించారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నీ అరెస్ట్ చేసి ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తుందనీ మండిపడ్డారు. బాబు అరెస్ట్ ను ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఖండిస్తున్నారనీ, రాబోయే ప్రజా ప్రభుత్వాన్ని మీరు ఎదుర్కోక తప్పదనీ ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో వెలగపూడి సృజన, చెట్టుపల్లి గోపి, ఉప్పులూరి చిన గోపి, ఎస్. శ్రీనివాస్, బాబు రావు, సి.హెచ్ సన్యాసి రావు, టీడీపీ, జనసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బూత్ స్థాయిలో బలోపేతం చేయడంలో భాగస్వామ్యం కండి

### – కేంద్ర మంత్రి నారాయణ స్వామి





విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :**భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షులు రవీంద్ర మేడపాటి ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి నారాయణ స్వామి విచ్చేసారు. ఈ సందర్భంగా నారాయణ స్వామి మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో భారతీయ జనతా పార్టీని గెలిపించేందుకు కార్యకర్తలు అందరూ తమ యొక్క పోలింగ్ బూత్ లలో పార్టీని బలోపేతం చేసే విధంగా పని చేయాలని, బూత్ స్థాయిలో ఉన్న ప్రజలందరితో సత్సంబంధాలను కలిగి ఉండాలని, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని, బూత్ కమిటీల నిర్మాణం ద్వారా పార్టీని బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని దిశానిర్దేశం చేసారు. వ్యక్తిగతంగా తమయొక్క ప్రాంతాలలో బలపడినట్లయితే పార్టీలో తగిన స్థానం లభిస్తుందని, కష్టపడి పని చేస్తే పదవుల కోసం ప్రయత్నాలు చేయకుండానే పార్టీ గుర్తించి తగిన స్థానాన్ని కల్పిస్తుందని, నీతి నిజాయితీలతో ప్రజలకు సేవ చేయడమే భారతీయ జనతా పార్టీ కార్యకర్తల లక్ష్యమని అన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణుకుమార్ రాజు, బీజేపీ ఉత్తరాంధ్ర జోనల్ ఇంచార్జి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపన చౌదరి, సాగి కాశీవిశ్వనాథ రాజు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్ర మోహన్, బీజేపీ రాష్ట్ర కోశాధికారి నాగేంద్ర, బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా ఇంచార్జి అడుసుమిల్లి కేశవకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నప్రసాద వితరణ




జ్ఞానాపురం **(విజయభాను న్యూస్) :** 41వ వార్డు సెబాస్టియన్ కాలనీ నందు బాలగణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసంతర్పణ కార్యక్రమానికి 41వ వార్డు కార్పొరేటర్ స్టాండింగ్ కమిటీ మెంబర్కోడిగుడ్ల పూర్ణిమ మరియు వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు కోడిగుడ్ల శ్రీధర్ సొంత నిధులతో నిత్యావసర సరుకులు అందించి వారే స్వయంగా అన్నప్రసాద వితరణ చేశారు. జ్ఞానాపురం బాయ్స్ యూత్ గర్భాపు శేఖర్ తమకు ప్రతి సంవత్సరం గణపతి నవరాత్రులకు సహకరిస్తున్నందుకు 41వ వార్డు వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకులు కోడిగుడ్ల శ్రీధర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 41వ వార్డు వైఎస్సార్సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ వి వెలంగిని రావు, కన్వీనర్లు అన్నపూర్ణ, దేవి, ఈశ్వరి,చుక్క శ్యామ్ సుందర్ రెడ్డి, ఆనంద్, దమర్సింగ్ శ్రీను, వైఎస్సార్సీపీ యువనాయకులు గర్భాపు శేఖర్, జై భీమ్ అధ్యక్షుడు పిల్లి గోవింద్, పిల్లా కార్తీక్, సాయి బబ్లూ, గర్భాపూ సాయి, బ్రహ్మాజీ, సిమ్మా, గెద్దడ లక్ష్మి, దమర్సింగు లక్ష్మి, లంక కనక, గిరి, కొర్లాపు కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### అవంతి ఫార్మా కళాశాలలో ఘనంగా ఫార్మాసిస్టుల దినోత్సవం




భీమునిపట్నం : విజయభాను న్యూస్ తగరపువలస దగ్గర ఉన్న చెరుకుపిల్లి అవంతి ఫార్మా కళాశాలలో సోమవారం ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ కాలేజ్ మాజీ ప్రిన్సిపాల్ డా. వి.రమణమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఫార్మసీ ప్రాక్టీస్ పరిశోధనలో ఉపయోగించే గుణాత్మక & పరిణాత్మక విధానాలు గురించి విద్యార్థులుకు వివరించారు. గౌరవ అతిథి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ కాలేజ్ ప్రొఫెసర్ డా.కె. ఈశ్వర్ కుమార్ ఎథ్నో ఫార్మసీ అంశాలను గురించి విద్యార్థులుకు క్షుణ్ణంగా వివరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో అవంతి కళాశాల ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.ఎం.బి.వి రాజు,వైస్ ప్రిన్సిపాల్ వి.ఉమా శంకర్, కళాశాల లెక్చరర్స్, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా బాలభాను విద్యాలయంలో

## గణపతి పూజలు



మురళి నగర్ **(విజయభాను న్యూస్)** బాలభాను విద్యాలయంలో వెలిసినటువంటి బాలభాను విజయ గణపతి ఈ గణపతి ప్రసిద్ధి ఏమిటంటే ఈ గణపతి ప్రసిద్ధి ఏమిటి అంటే ప్రతి విద్యార్థి ఈ గణపతిని తలుచుకుని ఐఐటీలో గాని మెడికల్ విద్యలో గాని పై చదువులో గాని అద్భుతమైన విజయం సాధించగలరని ఈ గణపతి యొక్క మహిమ అందరూ మురళినగర్ లో సెక్టర్ 8 ఉన్నటువంటి బాలభాను లో చదువుకున్న పూర్వ మరియు ప్రస్తుత విద్యార్థులు నమ్మకం. ప్రిన్సిపల్ ఎస్ వి ఎస్ శుభశ్రీ ఆధ్వర్యంలో ఈ తొమ్మిది రోజులు ఆమె చే పూజలు ఉదయం పూట పూజ చేసి ఉన్నారు సాయంకాలం పూజలు సిహెచ్ ప్రవీణ బి ఉషారాణి ఈ పూజలను అద్భుతంగా చేసి గణపతి ఉత్సవాలను పూర్తి చేసినారూ.

ఈ కార్యక్రమం లో భాగంగా నేడు విద్యార్థులు అందరకు మహా ప్రసాదంగా భోజన కార్యక్రమం జరుగును.

ఈ కార్యక్రమం అంతా కరస్పాండెంట్ బిఆర్ కె రాజుగారు వైస్ ప్రిన్సిపల్ టీ మనోరమణి, మరియు ఉపాధ్యాయులు సహాయ సహకారం అందించినారుసహాయ సహకారం అందించారు.

## ఫ్రెండ్లీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నసమారాధన



మధురవాడ (విజయభాను న్యూస్)జీవీఎంసి జోన్ 2 పరిధి 6 వ వార్డ్ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక చవితి నవరాత్రుల్లో భాగంగా ఫ్రెండ్లీ యూత్ అసోసియేషన్ పిఎం పాలెం ఆధ్వర్యంలో మంగళవారం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఫ్రెండ్లీ యూత్ అసోసియేషన్ పిఎం పాలెం కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో 9 రోజుల పాటు ప్రతేక్య పూజలు నిర్వహించి గురువారం సుమారు 5000 మంది అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత అగ్రస్థానంలో నిలుస్తు ముందుకు నడవాలని, అందుకు తన సహాయ సహకారాలు ఎల్లపుడు ఉంటాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఈ ఎన్ ఎస్ చంద్రరావు, గరే గురునాథ్, ఈశ్వర రావు, కృష్ణ, రమణ, ధనుంజయ్, కన్నరావు తదితరులు పాల్గొన్నారు

### కాంగ్రేస్ పార్టీ రాష్ట్ర మత్స్యకారుల ఫోరం చైర్మన్ గా కదిరి జగన్నాథం



భీమునిపట్నం, విజయభాను న్యూస్ : ఆంధ్రప్రదేశ్ కాంగ్రేస్ పార్టీ రాష్ట్ర మత్స్యకారుల ఫోరం చైర్మన్ గా భీమిలి కి చెందిన కదిరి జగన్నాథం నీ నియమిస్తూ సోమవారం విజయవాడలో రాష్ట్ర కాంగ్రేస్ కమిటి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు మరియు వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ , రాకేష్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందజేసారు.

అనంతరం కదిరి జగన్నాథం మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులను మరియు కార్యకర్తలను సమన్వయం చేసుకుని పార్టీ ప్రతిష్టకు కృషిచేస్తానని, మత్స్యకారులందరినీ ఒకే తాటిపై నడిపించి వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని మరియు 2024 లో అత్యధిక అసెంబ్లీ స్థానాలను మత్స్యకారులకు వచ్చే విధంగా నావంతు ప్రయత్నం చేస్తానని నామీద భరోసా వుంచి భాధ్యతను అప్పగించిన ఏ ఐ సి సీ అధ్యక్షులు మల్లికార్జునఖార్గే ఏ ఐ సి సీ జనరల్ సెక్రటరీ వేణుగోపాల్ రాష్ట్ర కాంగ్రేస్ కమిటీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు. సభ్యులు వేగి వెంకటేశ్వరరావు విశాఖ నగర కాంగ్రేస్ కమిటి అధ్యక్షులు గొంప గోవింద్ రాజు నాకు సహకరించిన నాతోటి నాయకులందరికీ పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు.

# విజయభాను సంపాదకీయం

## సభలో విద్వేష విషం!

పార్లమెంటులో అధికార, విపక్షసభ్యులు పరస్పరం తీవ్రమైన నిందలూ, ఘాటైన విమర్శలు చేసుకోవడం ఉన్నదే కానీ, బహుజన్ సమాజ్ పార్టీ ఎంపీ డానిష్ అలీని ఉద్దేశించి, బీజేపీ ఎంపీ రమేష్ బిధూరీ చేసిన విద్వేషపూరితమైన వ్యాఖ్యలు దేశచరిత్రలో ఎన్నడూ విననివి, కననివి. ఆయన నోటనుంచి వెలువడిన, రెట్టించిన ఆ మాటలు విన్న తరువాత, అవి పొరపాటునో, ఎదుటివారి వాదనను వమ్ముచేసే నిమిత్తం కేవలం ఆగ్రహావేశాలతో చేసినవి కావని ఎవరికైనా అర్థమవుతుంది. ఆ పదజాలం ఇటీవలి కాలంలో పనిగట్టుకొని ఒక వర్గాన్ని అవమానించేందుకు, అనుమానిం చేందుకు, దుష్టులుగా చిత్రీకరించేందుకు ఆయన పార్టీ ప్రాచుర్యంలోకి తెస్తున్నదే కనుక, తోటి పార్లమెంటు సభ్యుడు ఆ వర్గానికి చెందినవాడు కావడంతో సదరు బీజేపీ సభ్యుడు వాటిని ఇప్పుడు నేరుగా చట్టసభలోనే ప్రయోగించాడు. ఈ విద్వేషపూరిత, దారుణ, అశ్లీలపదజాలం ఆ సమయంలో సభాపతిగా వ్యవహరిస్తున్న కేరళకు చెందిన కాంగ్రెస్ నాయకుడికి కూడా అర్థంకాలేదు. విపక్ష సభ్యుల ప్రవర్తనలు, వ్యాఖ్యల విషయంలో ఎంతో కఠినంగా ఉంటూ, సభాసాంప్రదాయాలను, గౌరవాన్ని పరిరక్షించేందుకు వారి మైకులు కట్‌చేస్తూ, క్షణాల్లో సస్పెండ్ చేసే స్పీకర్ ఓంబిర్లా బిధూరీ విషయంలో మాత్రం 'ఇటువంటివి పునరావృతమైతే ఊరుకోనని' హెచ్చరిక చేసి వదిలేశారు. పార్టీ అధిష్ఠానం నోటీసులకు పరిమితం కావడం, నాలుగురోజులైనా పార్టీపరంగా బిధూరీ మీద చర్యలేమీ లేకపోవడం గమనించినప్పుడు పెద్దలంతా లోలోపల మురిసిపోతున్నారనే అనుకోవాలి.

సభలో గందరగోళం మధ్య తనకు ఆ వ్యాఖ్యలు వినబడనే లేదని ఓ మంత్రిగారు సమర్థించుకుంటున్నారు. అసలు వినబడనప్పుడు, అర్థమే కానప్పుడు బిధూరీ పక్కన కూచున్న ఆ ఇద్దరు మంత్రులకు ఎందుకంత నవ్వొచ్చిందో, అంతగా ఎలా ఆస్వాదించగలిగారో తెలియదు. ఇక, బిధూరీ వ్యాఖ్యల కారణంగా విపక్షసభ్యుల మనోభిప్రాయాలు దెబ్బతిన్న పక్షంలో అంటూ రాజ్‌నాథ్‌సింగ్ ఎంతో దీర్ఘం తీస్తూ చేసిన ప్రకటన కూడా ఆయనకు ఆ వ్యాఖ్యలు వ్యక్తిగతంగా కించిత్తు బాధకలిగించలేదనే చెబుతున్నాయి. ఈ పదేళ్ళకాలంలో ముస్లిం వ్యతిరేక వ్యాఖ్యలు వింటూ, వారిపై మూకదాడులు చూస్తున్నప్పుడల్లా దానినే ప్రజలు పతాకస్థాయి అనుకుంటూ వచ్చారు. కానీ, పాలకులను అంచనావేయడంలో మనం ఇంకా వెనుకబడే ఉన్నాం. సమాజంలోనూ, సామాజిక మాధ్యమాల్లోనూ, టీవీ చర్చల్లోనూ రేగుతున్న విద్వేషం ఇప్పుడు నిండుసభలో ప్రతిఫలించింది అంతే. ఇది ఒక సభ్యుడు మరో సభ్యుడిమీద ఆగ్రహంతో చేసిన వ్యాఖ్య కాదని, దాని లక్ష్యం విస్తృతమైనదని తెలుసుకుంటే, మతవిద్వేషంతో, వ్యక్తిత్వహననంతో దట్టించి ఉన్న ఆ మాటలమీద , డానిష్ ఆవేదనగా రాసిన లేఖ మీద స్పీకర్ స్పందన సరిగా అర్థమవుతుంది. ముస్లిం వ్యతిరేకత ఉన్నతస్థానాల్లో కూడా ఒక సర్వసాధారణ, ఆమోదనీయమైన విషయంగా మారిపోతున్నదని తెలుస్తుంది. ఇప్పుడు బిధూరీ నిండుసభలో ఈ మాటలన్నందుకు ప్రత్యేకంగా చెప్పుకుంటున్నాం కానీ, ఇంతకు మించిన విద్వేషపూరితమైన వ్యాఖ్యలను మనం బీజేపీ నాయకుల నోట ప్రజాక్షేత్రంలో అనునిత్యం వింటూనే ఉన్నాం.

ఏబీవీపీ నాయకుడి నుంచి పార్లమెంటు సభ్యుడిగా ఎదిగివచ్చిన క్రమంలో బిధూరీ చేసిన వివాదాస్పదవ్యాఖ్యలన్నింటినీ మీడియా ఏకరువుపెడుతున్నది. నిండుసభలో ఆయన మహిళా ఎంపీలను సైతం అవమానించిన సందర్భాలున్నాయి. ఇటలీలో పెళ్ళయిన ఐదారునెలలకే మనుమలను కూడా ఎత్తుకోవచ్చునంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఎవరిని ఉద్దేశించినవో ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. ఇక, ముస్లింలను ఉగ్రవాదులుగా, వారి రక్షకులుగా అభివర్ణిస్తూ బహిరంగ ప్రసంగాల్లో చేసిన వ్యాఖ్యలకు అడ్డేలేదు. అతడిని ఇంతచక్కగా పెంచిపోషించినవారు ఇప్పుడు ఏవో కొన్ని మాటలు సభలోకి తెచ్చినందుకు బహిష్కరణ శిక్షలు వేస్తారనుకోవడం భ్రమ. పైగా ఆయన హోం, రక్షణ మంత్రులకు సన్నిహితుడని, ఓడినచోటే మళ్ళీ టిక్కెట్ సంపాదించగల సమర్థుడని అంటారు.

ఒక విషయంలో మాత్రం బిధూరీ ఈ దేశప్రజల్లో కాస్తోకూస్తో మిగిలివున్న భ్రమలని చెరిపేశారు. కొత్తపార్లమెంటు భవనంలో విలువలు, సంప్రదాయాలు ఎంత చక్కగా అమలుకాబోతున్నాయో తొలిరోజునే తేల్చేశారు. విద్వేషపూరితమైన వ్యాఖ్యలను ఏ మాత్రం సహించకండి అంటూ సుప్రీంకోర్టు కిందికోర్టులను, పోలీసులను ఆదేశించినా, కొత్తగా పేరుమార్చుకున్న 'భారతీయ న్యాయసంహితలో' మాటవరుసకు మూడేళ్ళ కఠినశిక్షలు ఉన్నా, పాలకులే స్వయంగా పెంచి పోషిస్తున్న విద్వేషం సర్వత్రా వ్యాపిస్తూ ఇప్పుడు అధికారికంగా చట్టసభల్లోనే ప్రతిధ్వనించింది.

# ఆధార్‌పై మూడీస్ నివేదికను తోసిపుచ్చిన కేంద్రం




న్యూఢిల్లీ : ఆధార్ వ్యవస్థపై ప్రముఖ రేటింగ్ సంస్థ మూడీస్ విడుదల చేసిన నివేదికను కేంద్రం సోమవారం తోసిపుచ్చింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ సంస్థలు ఆధార్‌పై ప్రశంసలు కురిపించాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఇటువంటి గుర్తింపు వ్యవస్థను ఎలా అమలు చేయాలో తెలుసుకునేందుకు పలు దేశాలు ఉడాయ్ ని సంప్రదిస్తున్నాయని తెలిపింది. ఆధార్ వ్యవస్థను నిర్వహిస్తున్న ఉడాయ్ కూడా మూడీస్ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. మూడీస్ తన నివేదికలో చెప్పిన అభిప్రాయాలను సమర్థించేలా ప్రాథమిక, లేదా సెకండరీ సమాచారం లేదా అధ్యయనాలను ప్రస్తావించలేదు. ఉడాయ్ కి సంబంధించి లేవనెత్తిన సమస్యలకు సంబంధించి వాస్తవాలను నిర్ధారించడానికి ఎలాంటి ప్రయత్నాలు చేయలేదు. ఉడారు, ఆ వెబ్‌సైట్ పనిచేసే విధానంపై మాత్రమే మూడీస్ కేవలం అనుమానం వ్యక్తం చేసిందని పేర్కొంది.

ఆధార్ బయోమెట్రిక్ కోసం కేవలం వేలిముద్ర మాత్రమే కాకుండా, ఫేస్ అథెంటికేషన్, ఐరిస్ అథెంటికేషన్ వంటి కాంటాక్ట్‌లెస్ మార్గాలు కూడా ఉన్నాయన్న విషయాన్ని మూడీస్ విస్మరించిందని ఉడాయ్ తన ప్రకటనలో పేర్కొంది. దీంతో పాటు.. చాలా కేసుల్లో మొబైల్ ఒటిపిని వినియోగించుకునే సదుపాయం అందుబాటులో ఉందని తెలిపింది. సెంట్రలైజ్డ్ ఆధార్ వ్యవస్థలో భద్రతా, గోప్యతా ముప్పు పొంచి ఉందని నివేదికలో వాదించిందని కానీ, ఆధార్ డేటాబేస్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి డేటా ఉల్లంఘనలు జరగలేదని స్పష్టం చేసింది. ఆ విషయాన్ని ఇప్పటికే చాలా సార్లు పార్లమెంట్ ముందు నివేదించామని ఉడాయ్ వివరించింది.

ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ ఐడి ప్రోగ్రామ్ అధార్ అని మూడీస్ పేర్కొంది. ఆధార్ వ్యవస్థపై 'డీసెంట్రలైజ్డ్ ఫైనాన్స్ అండ్ డిజిటల్ అసెట్స్' పేరుతో సోమవారం ఓ నివేదిను విడుదల చేసింది. ఆధార్ వల్ల గోప్యత, భద్రతా ముప్పు పొంచి ఉందని, అన్ని వేళలా దాన్ని వినియోగించడం విశ్వసనీయం కాదని నివేదికలో పేర్కొంది. ముఖ్యంగా అంత్యంత తేమ, వేడి వాతావరణంలో పనిచేసే కార్మికులు ఆధార్‌ను వినియోగించడం అంత విశ్వసనీయం కాదని మూడీస్ పేర్కొంది. ముఖ్యంగా ఉపాధి హామీ కూలీలకు ఇచ్చే చెల్లింపులకు కేంద్రం ఆధార్‌ను తప్పనిసరి చేయడంపై ఈ వ్యాఖ్యలు చేసింది.

# తీవ్రవాదులకు అడ్డాగా మారిన కెనడా..
# భారత్‌కు మద్దతుగా నిలిచిన శ్రీలంక



ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత్ ప్రమేయం ఉందంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ట్రూడో ఆరోపణలతో భారత్–కెనడా మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయంలో పొరుగు దేశమైన శ్రీలంక భారత్‌కు మద్దతుగా నిలిచింది. ఈ మేరకు కెనడా ప్రధాని ట్రూడోపై ఆ దేశ విదేశాంగ మంత్రి అలీ సబ్రీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ట్రూడో ఏ విధమైన ఆధారాలూ ఇవ్వకుండా దారుణమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. 'కొంతమంది తీవ్రవాదులు కెనడాలో సురక్షిత స్థావరాన్ని ఏర్పరుచుకున్నారు. ఎటువంటి ఆధారాలూ లేకుండా కొన్ని దారుణమైన ఆరోపణలతో కెనడా ప్రధాని ముందుకొచ్చినట్లు అనిపిస్తోంది. గతంలో మాపై (శ్రీలంక) కూడా వారు ఇలాంటి ఆరోపణలే చేశారు. శ్రీలంకలో మారణహోమం జరిగిందన్నది భయంకరమైన అబద్ధం. మా దేశంలో మారణహోమం జరగలేదని అందరికీ తెలుసు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో నాజీలతో కలసి పోరాడిన వ్యక్తికి కెనడాలో సాదర స్వాగతం లభించడాన్ని చూశాను. ఇది నిజంగా ప్రశ్నించదగినది. కొన్ని సందర్భాల్లో ట్రూడో నిరాధార, దారుణ ఆరోపణలు చేయడం నాకేమీ ఆశ్చర్యం కలిగించలేదు' అంటూ వ్యాఖ్యానించారు.

# సింగపూర్‌లో 100 కేజీల బాంబు పేల్చివేత



సింగపూర్ : సింగపూర్‌లోని ఓ నిర్మాణ స్థలంలో బయటపడిన 100 కేజీల బాంబును ఆ దేశ ఆర్మీ నిపుణులు పేల్చివేశారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వీడియోను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. సింగపూర్‌లోని బకిట్ టిమా శివారులోని ఓ నిర్మాణ స్థలంలో బాంబు కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆర్మీ సాయం తీసుకొని అది రెండో ప్రపంచ యుద్ధ కాలం నాటిదని తేల్చారు. బాంబును వేరొక చోటుకు తరలించడం సాధ్యం కాదని గుర్తించి చివరకు దాన్ని అక్కడే పేల్చివేయాలనే నిర్ణయానికి వచ్చారు. అందుకోసం చుట్టుపక్కల నివాసం ఉంటున్న 4వేల మందిని ఖాళీ చేయించారు. బాంబు పేలుడు వినిపించే అవకాశం ఉన్నందున ప్రజలెవరూ భయపడాల్సిన పని లేదని ముందే ప్రకటన జారీ చేశారు. బాంబు పేల్చినా ఎలాంటి నష్టం వాటిల్లకుండా సింగపూర్ ఆర్మీ అధికారులు కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకున్నారు. సుమారు 40 మంది భద్రతా సిబ్బంది ఇసుక సంచులతో పేలుడు పరికరాన్ని కప్పేశారు. ఆ తరువాత చుట్టూ కాంక్రీటు బ్లాకులను అమర్చారు. ముందుగా నిర్దేశించుకున్న సమయం ప్రకారం బాంబును బ్లాస్ట్ చేశారు. దాంతో భారీ శబ్దం వినిపించింది. పేలుడు తరువాత ఆ ప్రాంతం సురక్షితమని నిర్ధారించుకున్న తరువాతే ప్రజలను తిరిగి తమ ఇళ్లలోకి అనుమతించారు. కాగా.. పేల్చివేసిన బాంబులో 47 కేజీల దాకా మందుగుండు ఉండొచ్చని ఓ మీడియా సంస్థ పేర్కొంది. దాంతో చుట్టుపక్కల నిర్మాణాలన్నింటినీ పేల్చివేయొచ్చని తెలిపింది. సింగపూర్‌లో గతంలోనూ ఇలాంటి బాంబులు వెలుగు చూశాయి. జియాక్ కిమ్ స్ట్రీట్‌లో 50 కేజీల బాంబు, మండాయ్‌లో 100 కేజీల బాంబు బయటపడ్డాయి.

# కవి సమయం

## దుష్టులకు దూరంగా వుండవలెను

దుష్టులతో స్నేహం చేస్తే మనకూ అదే విధమైన పేరు వస్తుంది. మీరు మంచివారయినా మీ సావాసగాళ్ళు చెడ్డవారైతే మిమ్మల్ని కూడా చెడ్డవారిగానే ఈ లోకం పరిగణిస్తుంది. తాడిచెట్టు క్రింద కూర్చుని పాలు త్రాగినా కల్లు తాగుతున్నాడనే అంటారు. అంటే దుష్టుల ఛాయకు అంత చెడ్డపేరు వుందన్నమాట. చెడ్డవారితో స్నేహం మొదలు బాగానే వుంటుంది. కానీ చివరకు వ్యసనాలను, అనేకమైన ఇతర దుర్గుణాలనూ నేర్పిస్తుంది. కాబట్టి చెడ్డవారికి దూరంగా వుండటం మంచిది. ఈ విషయాన్ని ఓ వేమన పద్యం ద్వారా విందాం.

'కానివానితోడు గలసి మెలుగుచున్న
గానివానివలెనె కాంతురవని
తాడిక్రిందుబాలు త్రాగిన చందమౌ
విశ్వదాభిరామ వినురవేమ'


... రచయిత
వడ్లమాని అన్నపూర్ణ

# పంచాంగం

| త్రయోదశి రా. 8.47 ధనిష్ఠ ఉ.6.8<br>శతభిషం రా.తె. 4.22 వ.మ. 12.48ల 2.17 | బుధవారం<br>27-09-2023 |
|---|---|

a **మేషం** : కొంతమంది సూటిపోటి మాటలు పడటం వల్ల మానసిక ఆందోళనకు గురవుతారు. పాత వస్తువులను కొని ఇబ్బందులను ఎదుర్కొంటారు. ట్రాన్స్‌పోర్టు, ట్రావెలింగ్ రంగాల వారికి కలిసిరాగలదు. దూర ప్రాంతాలకే చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. b **వృషభం** : ధనం ఏమాత్రం నిలబెట్టలేక పోయినా ఆర్థిక ఇబ్బంది అంటూ ఏదీ ఉండదు. సాంస్కృతిక, సేవా కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తారు. అకాల భోజనం, ప్రశాంతత లోపం వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు పనివారలతో సమస్యలు తలెత్తుతాయి. రిజిస్ట్రేషన్లకు ఇది అనువైన సమయం కాదు. c **మిథునం** :మీరు చేసే పనులకు బంధువుల నుంచి విమర్శలు, వ్యతిరేకత ఎదుర్కొనక తప్పదు. ముఖ్యులకు బహుమతులను అందజేస్తారు. రాబోయే కాలంలో ఖర్చులు, అవసరాలు మరింత పెరిగేందుకు ఆస్కారం ఉంది. నిరుద్యోగులకు ఉపాధి పథకాలు సంతృప్తికరంగా సాగుతాయి. వాగ్వివాదాలకు దూరంగా ఉండటం మచిది. d **కర్కాటకం** : ప్రముఖులను కలుసుకుని బహు మతులను అందజేస్తారు. మధ్యవర్తిత్వం వహించుట వల్ల ఇబ్బందులను ఎదుర్కొం టారు. మీలోని శక్తిసామర్థ్యాలు ద్విగుణీకృతమయ్యే అవకాశం దక్కుతుంది. ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు లభిస్తుంది. వృత్తి, ఉద్యోగాలలో వారికి ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. ధన లబ్ధి పొందుతారు. e **సింహం** : ప్రైవేటు సంస్థలలోని వారికి ప్రతి విషయంలోనూ ఓర్పు , లౌక్యం అవసరం. మీ అభిరుచులకు తగిన వ్యక్తులతో పరిచయాలు పెంచుకుంటారు. విదేశాలకు వెళ్లడానికి చేయు యత్నాలు ఫలిస్తాయి. స్త్రీలకు పనివారితో చికాకులు ఎదురవుతాయి. ఉద్యోగస్తుల హోదా పెరగడంతో పాటు... బరువు బాధ్యతలు అధికమవుతాయి. f **కన్య** :ప్రభుత్వ కార్యక్రమాలలోని పనులు అనుకూలిస్తాయి. స్త్రీలకు షాపింగ్, వ్యవహారాలలో మెళకువ అవసరం. నిరుద్యోగులకు బోగస్ ప్రకటనలు, కొత్త వ్యక్తుల పట్ల అప్రమత్త అవసరం. గృహంలో చికాకులు తొలగి ప్రశాంతత నెలకొంటుంది. మీ సంతానం కోసం ధనం బాగా వ్యవం చేయవలసి వస్తుంది. g **తుల** : ఇప్పటివరకు విరోధులుగా ఉన్న వ్యక్తలను సుముఖం చేసుకోగలుగుతారు. ప్రేమికులు పెద్దల ఆగ్రహావేశాలకు గురికావలసి వస్తుంది. వాహన చోదకులకు ఆటంకాలు తప్పవు. బంధు మిత్రులతో మనస్పర్థలు తలెత్తు తాయి. చేతి వృత్తి వ్యాపారులకు లాభదాయకం. రాజకీయ రంగాల వారికి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. h **వృశ్చికం** : ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. పెద్దల ఆరోగ్య, ఆహార విషయాల్లో మెళకువ అవసరం. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తినిస్తాయి. మిత్రుల కారణంగా మీ కార్యక్రమాలు మార్చుకోవలసి వస్తుంది. బంధువుల రాక వల్ల ఖర్చులు అధికమవుతాయి. సిమెంట్, ఇసుక, ఐరన్, కలప వ్యాపారులకు పురోభివృద్ధి. i **ధనుస్సు** :వ్యాపారాల్లో నూతన భాగస్వాములను చేర్చుకునే విషయంలో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి వస్తుంది. పత్రిక, ప్రైవేటు సంస్థలలోని వారికి యాజమాన్యం తీరు నిరుత్సాహం కలిగిస్తుంది. విద్యార్థుల ఆలోచనలు పక్కదారి పట్టే ఆస్కారం ఉంది. దైవ కార్య క్రమాలకు కుటుంబీకులతో ఉల్లాసంగా గడుపుతారు. j **మకరం** : ఉద్యోగస్తుల శక్తి సామర్థ్యాలను అధికారులు గుర్తిస్తారు. మీ శ్రీమతి సలహా పాటించడం చిన్నతనంగా భావించకండి. విద్యా, వైజ్ఞానిక విషయాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. విలాస వస్తువులు అమర్చుకోవాలనే స్త్రీల కోరికలు నెరవేరుతాయి. కాంట్రాక్టర్లకు ఇంజనీరింగ్ అధికారుల నుంచి అభ్యంతరరాలెదుర్కోవలసి వస్తుంది. k **కుంభం** :చిన్నాటి మిత్రులను, ప్రియమైన వ్యక్తులను కలుసుకుంటారు. మీ జీవిత భాగస్వామి సలహా తీసుకోవడం శ్రేయస్కరం. మీ కళత్ర మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. ప్రైవేటు సంస్థలలోని వారికి ఓర్పు, నేర్పు పరీక్షా సమయం. అనవసరపు వాగ్దానాలు చేసి సమస్యలు తెచ్చుకోకండి. రుణ యత్నాలు వాయిదా పడతాయి. దూర ప్రయాణాలు విసుగు కలిగిస్తాయి. L **మీనం** : వ్యాపారంలో పెరిగిన పోటీని తట్టుకోవడానికి అహర్నిశలు శ్రమిస్తారు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. రుణ బాధలు తొలగుతాయి. నిరుద్యోగులకు ఇంట ర్వ్యూలు, రాత పరీక్షలలో మెళకువ, ఏకాగ్రత అవసరం. పత్రాలకు సంబంధించిన విషయాలలో ఏకాగ్రత ముఖ్యం. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతలను స్వీకరిస్తారు.

# అన్వేషకులు సంకీర్తన



లోకం శోకమయం అని గుర్తించిన బుద్ధుడు, దాన్ని తొలగిం చేందుకు మార్గాన్వేషణ సాగించాడు. దుఃఖం చీకటిలాంటిది. దూషించినా, శపించినా, పోట్లాడినా అది పోదు. చిరుదివ్వె వెలిగిస్తేనే అంధకారం తొలగుతుంది. కాంతికి రణాలే లోకాన్ని సంతోషంతో నింపుతాయి.

అన్ని దుఃఖాలకు మూలకారణం కోరికలని బుద్ధుడు కనుగొన్నాడు. చుట్టుముట్టిన కాంక్షల కారుచీకటి తొలగేలా, మానవాళికి దివ్యమైన మార్గం చూపే దివ్వెను వెలిగించాడు. స్వార్థం, అహంకారం ఉన్నచోట శాంతి అనేకాంతి కిరణానికి చోటు వుండదు. లోకానికి దారిచూపిన మహాత్ములందరూ, ముందుగా తమలోని తిమిరంతో సమరం చేసినవారే. బుద్ధుడిలా కఠోరదీక్ష వహించి, మార్గాన్వేషకులుగా మారినవారే. వారు లోకం సుఖసంతోషాల కోసం తమ సుఖాల్ని వదులుకున్నారు. ప్రకృతి ధర్మాల్ని అసాంతం పరిశీలించారు. చావు పుట్టుకల గుట్టు తెలుసుకున్నారు. శ్రీకృష్ణ భగవానుడు 'గీత' ద్వారా అందించిన సందేశం అదే. ఆధునిక యుగంలో స్వామి రామతీర్థ ఇచ్చిన సమాధానం అదే!

రామతీర్థ రుషీకేశ్‌లో ఉన్నప్పటి సంఘటన ఇది. ఒకరోజు ఆయన బంధువు దుఃఖిస్తూ అక్కడికి వెళ్లాడు. ఆయన ప్రశ్నార్థకంగా చూశారు. ఇంకేముంది నాయనా! అంతా అయిపోయింది. మీ గ్రామం మురళీవాలాలో వుండే నీ కుమారుడు చనిపోయాడు' అన్నాడా బంధువు.

స్వామిలో ఎలాంటి చలనం కనిపించలేదు. 'గాలి వీస్తుంటుంది. నీరు ప్రవహిస్తుంటుంది. అవి ఎంత సహజమో, చావు పుట్టుకలు సైతం అంతే. ఈ సహజ పరిణామానికి నువ్వుగాని, నేను గాని విలపించడం ఎందుకు' అని ప్రశ్నించి ఆయన తిరిగి ధ్యానంలోకి వెళ్లిపోయారు. ప్రకృతి పరమ రహస్యాన్ని విజ్ఞాన శాస్త్రవేత్తలా, ఆధ్యాత్మిక తత్వవేత్తా తెలుసుకోగలడని ఆయన నిరూపించారు.

జపాన్, ఇంగ్లాండ్, ఈజిప్ట్, అమెరికా దేశాల్లో పర్యటిస్తూ రామతీర్థ సత్యాన్వేషణ కొనసాగించారు. 'కార్యసిద్ధి కావాలంటే ముందుగా మనసు చైతన్యవంతం కావాలి. నిరంతర నదీ ప్రవాహంలా అది మారాలి' అని ఆయన తేటతెల్లం చేశారు.

సత్యాన్వేషకులకు తరచుగా గురువులు తారసపడతారు. 'అందరికంటే నేనే గొప్ప, ఎవరి నుంచి ఏమీ నేర్చుకోవాల్సిన అవసరం లేదు' అని భావించేవారికి ఎక్కడా గురువు లభించడు. జీవితానుభవాలతో పండిపోయిన వృద్ధుల్లో పలువురు 'తెలుసుకోవాల్సింది చాలా ఉంది' అనే సత్యాన్ని గ్రహిస్తారు.

రవీంద్రనాథ్ ఠాగూర్ బాల్యం నుంచే కవితలు రాసేవారు. ప్రకృతిని మనోహరంగా వర్ణించేవారు. ఓ రోజు ఓ బంధువు 'నీ భాష బాగుంటుంది. నీ కవిత్వం వినడానికి ఇంపుగా వుంటుంది. అందులోని భావాల్ని నువ్వు అనుభవాల్ని బట్టి రాస్తున్నావా, లేక కల్పనలా' అని సూటిగా ప్రశ్నించాడు. అవన్నీ కల్పనలు కావడంతో, ఠాగూర్ సమాధానం ఇవ్వలేదు. ఆ బంధువు ఒక నవ్వు నవ్వి వెళ్లిపోయాడు.

ఆ తరువాత ఒకనాటి సాయంత్రం ఠాగూర్ సముద్రతీరానికి షికారుకెళ్లారు. అక్కడ సూర్యుడు సముద్రజలాల్లో తళతళలాడుతూ ప్రతిఫలిస్తున్నాడు.

సముద్రం ఇవతల ఉన్న ఒక గుంటలోని నీటిలోనూ సూర్యకిరణాల కాంతి పడటాన్ని ఆయన చూశారు. 'నా అన్వేషణ ఫలించింది. పరమేశ్వరుడి ప్రతిబింబాన్ని ప్రతిచోటా దర్శించవచ్చు అనే సత్యం గ్రహించాను' అనుకుంటూ తిరిగి ఇంటికి వెళ్లిపోయారు. ఆనాటినుంచి ఠాగూర్ రాసిన కవితల్లో ప్రకృతి వర్ణనతో పాటు దైవతత్వం ప్రతిఫలించడం మొదలైంది.

ఇదే సత్యం భాగవతం వంటి పురాణగాథల్లోనూ కనిపిస్తుంది. మహర్షులు తమ ఆధ్యాత్మిక అనుభవాల్ని, అన్వేషణ ఫలితాల్ని పురాణాల రూపంలో వెల్లడించారు. అనంతర కాలంలో, ఆధునిక మేధావులు మళ్లీ అన్వేషణ సాగించడం ద్వారా అవే సత్యాల్ని తిరిగి ఆవిష్కరించారు!

# వచ్చిన సమస్యలను ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారించాలి

కాకినాడ : డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో వచ్చిన సమస్యలను ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారించాలని జేసీ ఎస్. ఇలక్కియ అధికారులను ఆదేశించారు. మంగళవారం జేసీ ఇలక్కియ ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాల్లో వివిధ ప్రాంతాల నుంచి 13 మంది సంక్షేమ పథకాల లబ్ధి, విద్య, ఉపాధి, భూ సర్వే, భూ సమస్యలు, పారిశుధ్యం వంటి సమస్యలపై టోల్ ఫ్రీ నెంబర్ 18004253077కు ఫోన్ చేసి సమస్యలను నేరుగా తెలియజేశారు. ఈ సందర్భంగా జేసీ ఇలక్కియ మాట్లాడుతూ ప్రజల సమస్యల్ని నేరుగా తెలుసుకునేందుకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని ప్రతి మంగళవారం నిర్వహిస్తున్నామన్నారు. డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో ఫోను ద్వారా తెలియజేసిన సమస్యలను నాణ్యతతో గడువులోగా పరిష్కరించాలన్నారు. ఫోన్ ద్వారా తెలియజేసిన 13 మంది వ్యక్తుల సమస్యలను పరిష్కారం నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు పంపించడం జరిగిందన్నారు. ఈ సమస్యలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో కె. శ్రీధర్ రెడ్డి, ఏవో జీఎస్ఎస్ శ్రీనివాసు, వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పబ్లిక్ హెల్త్ వర్కర్లకు బిపి షుగర్ పరీక్షలు

## చైర్ పర్సన్ ఈశ్వరమ్మ



సాలూరు విజయభాను న్యూస్ సెప్టెంబర్ 26 సాలూరు మున్సిపల్ ఆఫీసు పరిదిలో మెడికల్ కాంప్ నిర్వహించటము స్వేచ్ఛాత హి సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మెడికల్ క్యాంపులో మున్సిపల్ పబ్లిక్ హెల్త్ వర్కర్స్ యొక్క ఆరోగ్యమును బిపి, షుగర్ పరీక్షించడం జరిగినది. ఈ మెడికల్ క్యాంపులో చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, మున్సిపల్ కమిషనర్ టి జయరాం పాల్గొని పర్యవేక్షించారు. మెడికల్ క్యాంపు అయిన అనంతరం ఈశ్వరమ్మ అధ్యక్షతన సమావేశం జరిగినది. వారి యొక్క అమూల్యమైన సందేశాన్ని అందించారు. మున్సిపల్ కమిషనర్ టి జయరాం వారు సందేశాన్ని అందించారు. మున్సిపల్ మేనేజర్ రాఘవాచారి, మున్సిపల్ ఇన్చార్జి డి ఇ సూరి నాయుడు, మున్సిపల్ ఆర్ ఐ మహమ్మద్, మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ మెడికల్ క్యాంపు కార్యక్రమాన్ని డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ మహిపాల్, డాక్టర్ హర్షితా ప్రియా వీరి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు జరిగినది. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మెడికల్ క్యాంపులో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని శానిటరి ఇన్స్పెక్టర్ ఫకీర్ రాజు విజయవంతముగా నిర్వహించారు. ఈ కార్యక్రములో మున్సిపల్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# ప్రజారోగ్య భద్రతే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం

## కలెక్టర్ నిశాంత్ కుమార్



పార్వతీపురం,విజయ భాను న్యూస్ సెప్టెంబరు 26 : ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించి సురక్షితంగా ఉండేందుకు ఇటివద్ద ఉచిత వైద్యం అందించాలన్నదే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. మండలంలోని అడ్డాపు శీల గ్రామ మండల పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత మోడల్ మెడికల్ క్యాంపు ను మంగళవారం సందర్శించారు.వైద్య చికిత్స కొరకు వచ్చిన బాధితుల రిజిస్ట్రేషన్ వివరాలు,కే షీట్,మందుల నిల్వలు,వివిధ కౌంటర్ల ద్వారా అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటి తలుపు తట్టి ఆరోగ్య సమస్యలను పరీక్షించడం తోపాటు మెరుగైన వైద్యం అందించి నయం చేసేలా ప్రభుత్వం భాధ్యత తీసుకుంటుంది అని తెలిపారు. అనారోగ్య బాధితులను గుర్తించి ఉచితంగా ఏడు రకాల పరీక్షలు నిర్వహించాలన్నారు. ఉచిత మెడికల్ క్యాంపులు తహిశీల్దార్,ఎంపీడీవోలు పగడ్బందిగా నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీడీవోలు క్యాంపుల నిర్వహణను గ్రామ వాలంటీర్లతో ముందురోజు సమావేశాలు నిర్వహించి అందరికి తెలియ జేయడంతో పాటు వైద్య చికిత్స కోసం వచ్చే బాధితులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్లాట్ విధానం పాటించాలన్నారు. క్యాన్సర్ , కిడ్నీ వ్యాధులు వంటి దీర్ఘకాలిక బాధితులు ఉన్నట్లయితే గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణ ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యుల సూచనల మేరకు మందులు అందించడం, అవసరమైతే ఆస్పత్రులకు తరలించడం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్యాంపు పూర్తి బాధ్యతను ఫ్యామిలీ డాక్టర్ తీసుకుని మందుల కొరత లేకుండా అవసరమైన మేరకు నిల్వలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గర్భిణీలు,బాలింతలతో పాటు రక్తహీనత బాధితులను గుర్తించి అవసరమైన మందులు,ఫుడ్ సప్లమెంటేషన్ అందజేయాలన్నారు. బాధితులకు చికిత్స అందిస్తూనే జీవన శైలిలో తీసుకోవాల్సిన ఆహార నియమాలు పాటించాలి అని తెలిపారు. వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద అర్హులందరికీ ఉచితంగా మెరుగైన వైద్యం కొరకు అందుబాటులో ఉన్న సేవలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు. కంటి పరీక్షలు అనంతరం వృద్ధులకు కళ్ళ అద్దాలను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు ప్రజలు ఇటువంటి సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా బగాది జగన్నాధ రావు,జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ కొయ్యాన అప్పారావు,జిల్లా ఆర్బిఎస్కె అర్ బి ఎస్ కె అధికారి డా ధవళ భాస్కర రావు,జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా టి జగన్మోహన్ రావు, జిల్లామహిళా శిశు సంక్షేమ అధికారి కేతిరెడ్డి పైప్ విజయగౌరి,జిల్లా ఆసుపత్రి సూపరిండెండెంట్ డా, వాగ్దేవి,వైద్యులు,తాశీల్దార్ శివన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి పోటీలకు సారథి ఉన్నత పాఠశాల విద్యార్థులు



రాజాం (విజయభాను న్యూస్) : పట్టణంలో సారథి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల రాజాంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన ఈ పోటీల్లో అండర్ -14 జూనియర్స్ విభాగంలో 400 మీటర్ల పరుగుపందెంలో ఎం. హేమలత ద్వితీయ స్థానం సంపాదించింది. అండర్ -17 విభాగంలో 3 వేల మీటర్ల వాకింగ్ పోటీల్లో డి. పూర్ణ తృతీయ స్థానం సాధించింది. షార్ట్ పుట్ విభాగంలో టి. హేమలత ద్వితీయ స్థానం సాధించగా, టి, దుర్గా జూనియర్స్ షార్ట్ పుట్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచింది. డిస్కస్ త్రో లో టి. హేమలత ద్వితీయ స్థానం సాధించింది. టెన్నీకాట్ జూనియర్స్ విభాగంలో ఎం. హేమల, కె. మౌనికలు ప్రథమ స్థానంలో నిలవగా, సీనియర్ టెన్నీకాట్ విభాగంలో ఎం. గోపిక, జి,గాయత్రిలు ప్రథమ స్థానంలోనిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల హెచ్ఎం బి.మాధురి, పీడీ మండ లక్ష్మిలు అభినందించారు.

# జర్నలిస్టుల తొలగింపుపై అధ్యయనం కోసం సబ్‌కమిటీ

న్యూఢిల్లీ : కొవిడ్ సమయంలో జర్నలిస్టుల తొలగింపుపై అధ్యయనం నిర్వహించేందుకు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పిసిఐ) సబ్ కమిటీని నియమించింది. 2020 మార్చి నుండి 2021 ఫిబ్రవరి మధ్య వేటుకు గురైన జర్నలిస్టులు తమ వివరాలను పంపాల్సిందిగా కోరింది. ఆన్‌లైన్ ఫామ్ లేదా ఇమెయిల్ ద్వారా సబ్‌కమిటీకి వివరాలు అందించాల్సిందిగా జర్నలిస్టులకు సూచించింది. మహమ్మారి సమయంలో వేటుకు గురైన జర్నలిస్టుల నివేదికను రూపొందించేందుకు మాత్రమే సమాచారాన్ని సేకరిస్తున్నామని, ఈ అధ్యయనంతో వారు ఎలాంటి ఉపశమనం కలిగించే అవకాశం ఉండదని గుర్తించాల్సిందిగా పిసిఐ ఓ ప్రకటనలో తెలిపింది. ఉపశమనం కలిగించే అధికారం కాని, పరిధి కాని పిసిఐకి లేవని స్పష్టం చేసింది. ఈ సబ్ కమిటీలో పిసిఐ సభ్యులు గుర్బీర్ సింగ్, ఎల్.సి. భారతీయ, ప్రజ్ఞానంద చౌదరి, జె.ఎస్. రాజ్‌పుత్ సహా జర్నలిస్టులు పి. సాయినాథ్, స్నేహసిస్‌లు కో ఆప్టెడ్ సభ్యులుగా ఉండనున్నారు. పిసిఐ పార్లమెంటరీ చట్టం ద్వారా ఏర్పడిన న్యాయ స్వతంత్ర సంస్థ. పత్రికా స్వేచ్ఛను రక్షించడం, వారాపత్రికలు, వార్తా సంస్థల ప్రమాణాలను మెరుగుపరచాలన్న రెండు లక్ష్యాల కోసం ఈ సంస్థ పనిచేస్తుంది.

# ప్రపంచ పర్యాటకం పై అవగాహన

శ్రీకాకుళం, సెప్టెంబర్ 26: ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భంగా రాష్ట్ర పర్యాటక ముఖ్య కార్యదర్శి మరియు కమిషనర్ వారి ఆదేశానుసారం ఈరోజు టీపీమ్ స్కూల్ నందు యువ పర్యాటక క్లబ్ మరియు రోటరీ క్లబ్ శ్రీకాకుళం ఆద్వర్యం లో ప్రపంచ పర్యాటకం పై అవగాహన కార్యక్రమం జరిగింది . జిల్లా పర్యాటక అధికారి నడిమింటి నారాయణరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూప్రతి విద్యార్థి సామాజిక బాధ్యతతో మొక్కలు నాటవలెనని పర్యావరణ సమతుల్యత పరిరక్షించాలని మరియు ప్లాస్టిక్ వాడకం నిషేదించాలని కోరారు యువ క్లబ్ కో కన్వీనర్ మరియు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ గీతా శ్రీకాంత్, విద్యార్థులకు యువ క్లబ్బుల గురించి మరియు జిల్లాలో ఉన్న పర్యాటక ప్రదేశాల గురించి వివరించడమైనది. విద్యార్థులతో ట్రావెల్ ఫర్ లైఫ్ ప్రతిజ్ఞ చేయించారు . ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ చంద్ర శేఖర్ , ఉపాధ్యాయులు నీరజ , గాయత్రీ ఇంటెక్ కన్వీనర్ రాధా ప్రసాద్ పర్యాటకశాఖ అసిస్టెంట్ టూరిజం అధికారి డి రమేష్ , విద్యార్థులు పాల్గొన్నారు

ప్రతిజ్ఞ నేను భారత దేశ పౌరుడిని, ఒక పర్యాటకుడిగా ఏ గమ్యస్థానానికి వెళ్లేప్పుడైనా ఈ ప్రతిజ్ఞ చేస్తున్నాను.

1. భూమండలంతో స్నేహపూర్వక స్పృహతో కూడిన జీవనశైలిని అవలంబిస్తాను. అలాగే పర్యాటక వనరులను బుద్ధిపూర్వకంగా ఉపయోగించడాన్ని ప్రోత్సహిస్తాను.
2. స్వచ్ఛమైన ఇంధనం మరియు నీటి సంరక్షణ పర్యాటక ఉత్పత్తులు/సేవలను ఎంచుకుంటాను.
3. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తాను. అలాగే నా ప్రయాణంలోనూ వ్యర్థాలను వీలైనంత వరకు తగ్గించడానికి ప్రయత్నిస్తాను.
4. భవిష్యత్ తరాలకు స్థానిక సంస్కృతి మరియు వారసత్వాన్ని పరిరక్షించడానికి మరియు గౌరవించడానికి కట్టుబడి ఉంటాను.
5. వన్యప్రాణుల సంరక్షణకు చురుగ్గా మద్దతిస్తాను.
6. కమ్యూనిటీ ద్వారా నడిచే పర్యాటక సే.

# జగనన్న ఆరోగ్య సురక్ష పకడ్బందీగా నిర్వహించండి

## జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు ఈ నెల 30 నుండి సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించండి

## జగనన్న ఆరోగ్య సురక్ష ప్రయోగాత్మక వైద్య శిబిరాన్ని సందర్శించి, దిశా నిర్దేశం చేసిన కలెక్టర్



శ్రీకాకుళం, సెప్టెంబర్ 26: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందని, నేడు చేపట్టిన ప్రయోగాత్మక వైద్య శిబిరంలో ఏమైనా లోటు పాట్లు ఉంటే వాటిని సవరించుకుని, జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఈ నెల 30 నుండి సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ దిశా నిర్దేశం చేశారు. మంగళవారం ఉదయం అల్లినగరం గ్రామ సచివాలయంలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా. బి. మీనాక్షి, జిల్లా పరిషత్ సి.ఇ.ఓ వెంకట్ రామన్, తదితర సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించి చేపట్టనున్న పనులపై దిశా నిర్దేశం చేశారు.

కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామ వార్డు సచివాలయం పరిధిలో ఈ నెల 15 న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై గృహ సందర్శనతో అవగాహన కల్పించే క్యాంపెయిన్ ప్రారంభించబడిందని, వాలంటీర్లు, ప్రజా ప్రతినిధులు క్షేత్రస్థాయిలో వారి పరిధిలోని గృహ సందర్శన చేసి ప్రజలకు అవగాహన కల్పించడం, ఆరోగ్యశ్రీ పై అవగాహన కల్పించడం జరుగుతోందని, అలాగే ఏఎన్ఎం, సిహెచ్ఓ ల గృహ సందర్శన తేదీలను తెలిపిన అనంతరం, ఏఎన్ఎం, ఆశా, వాలంటీర్లు ఒక బ్యాచ్ గా, సీహెచ్ఓ, వాలంటీర్లు, ఆశాలు మరొక బ్యాచ్ గా గృహ సందర్శన చేసి ఇంటిలోని వారి సెల్ ఫోన్ నందు ఆరోగ్యశ్రీ యాప్ ను డౌన్లోడ్ చేసి దాని వినియోగం తెలియచేస్తూ వారి ఇంటి వద్దనే ఏడు రకాల పరీక్షలు చేసి ఆరోగ్య వివరాల రిపోర్టును మొబైల్ యాప్ నందు నమోదు చేసి ప్రొఫైల్ జెనరేట్ చేసి, కేస్ షీట్ జెనరేట్ చేసి, పరీక్షల రిపోర్టులు వైద్య శిబిరాలు నిర్వహించే నాటికి డాక్టర్ల కు అందుబాటులో ఉండేలా సిద్ధం చేయడం జరుగుతోందని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వైద్య శిబిరాలు క్షేత్ర స్థాయిలో ఈ నెల సెప్టెంబర్ 30 నుండి ప్రారంభం అవుతాయని అన్నారు. అలాగే వైద్య శిబిరాలకు 3 రోజుల ముందు మళ్ళీ ఒకసారి వాలంటీర్లు, ప్రజా ప్రతినిధులు కలిసి గృహ సందర్శనలో ప్రజలకు వైద్య శిబిరం వివరాలు తెలపాల్సి ఉంటుందని అన్నారు.

ఈ కార్యక్రమం మార్గదర్శకాల మేరకు జిల్లా, మండల, మునిసిపాలిటీ వారీగా అధికారులు అన్ని స్థాయిలలో సమన్వయంతో పని చేసి ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను విజయవంతం చేయాలని కోరారు. హెల్ప్ డెస్క్ ఏర్పాటుతో ఒక ఆరోగ్య కార్యకర్త వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన ప్రజలకు రిజిస్ట్రేషన్ మొదలు ఓపి చీటీ అందజేయడం, సంబంధిత డాక్టర్ రూమ్ చూపడం మందులు తీసుకుని వెళ్ళేవరకు సహకారం అందిస్తారని అన్నారు. అన్ని ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెదబిడ్డ రచ్చబండని ప్రారంభించిన ఎంపీపీ శెట్టి నీలవేణి



అనంతగిరి, విజయభాను న్యూస్ : అనంతగిరి, జిల్లా పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన రచ్చబండ ను ఎంపీపీ శెట్టి నీలవేణి మంగళవారం రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. పెదబిడ్డ, గుమ్మ జంక్షన్ లో నిత్యం ప్రయాణికులు సేదతీరేందుకు వీలుగా ఎంపీపీ నీలవేణి చొరవతో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర నిధులు మంజూరు చేయగా స్థానిక వార్డు సభ్యులు గంగులు నిర్మాణం చేపట్టారు. ఎంపీపీ కి, చైర్ పర్సన్ కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంటమ్మ, వార్డు సభ్యులు గంగులు, ప్రసాద్, ysrcp నాయకులు కృష్ణ మూర్తి, శ్రీను, బిడ్డ కృష్ణ ,ఇంజనీరింగ్ అసిస్టెంట్ , సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ కుట్రతో చంద్రబాబు పై అక్రమ స్కిల్ కేసు: మాజీ మంత్రి కోండ్రు




రాజాం : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ రాజాం తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద సామూహిక రిలే నిరాహారదీక్షలు మాజీ మంత్రి రాజాం నియోజకవర్గం తెదేపా ఇంఛార్జి కోండ్రు మురళీమోహన్ ఆధ్వర్యంలో మంగళవారం నాడు పెరికల సంక్షేమ సంఘం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోండ్రు మాట్లాడుతూ

ఆర్థిక నేరస్తుడైన జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని పరిపాలిస్తుండడం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యమని సీఎం జగన్ మోహన్ రెడ్డిని దుయ్యబట్టారు. ఐఏఎస్ అధికారుల సిఫారసు మేరకే స్కిల్ డెవలప్మెంట్ ప్రాజెక్టు నాటి టీడీపీ ప్ర భుత్వం ఆమోదం తెలిపిందని కోండ్రు గుర్తు చేశారు. సీఐడీతో సహా మంత్రులు ఎమ్మెల్యేలు సీఎం జగన్ కు ఊడిగం చేస్తున్నారని కోండ్రు మండిపడ్డారు. రాష్ట్రంలో సైకో పాలన నడుస్తోందని. సైకో ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా రాజకీయంగా ప్రజల్లో ఓటమి తప్పదని భావించి కక్ష సాధింపు చర్యలు చేపట్టి చంద్రబాబు పై అక్రమ కేసు పెట్టడం ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమన్నారు.


భవిష్యత్తులో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తెదేపా అధికారంలోకి వచ్చి వైసీపీ నియంతకు తగినబుద్ధి చెబుతామని కోండ్రు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రంలో 40 ఇంజనీరింగ్ కళాశాలతో పాటు ఐటీఐ. పాలిటెక్నిక్ కళాశాలల్లో నైపుణ్యాభివృద్ధి ఇన్స్టిట్యూట్లు ఏర్పాటు చేసి. వీటి ద్వారా 2300 పైగా జాబ్ మేళాలు నిర్వహించి 85 వేల మందికి ఉద్యోగ అవకాశాలు

కల్పిస్తే వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యగా అక్రమ స్కిల్ డెవలప్మెంట్ కేసు నమోదు చేయించడం సిగ్గుచేటు అన్నారు. ప్రజల కోసం అహర్నిశలు కష్టపడి, ప్రజల సంక్షేమం కోసం పాటుప డిన ప్రజానేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టును యావత్ తెలుగు ప్రజానీకం ఖండిస్తుందని కోండ్రు అన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ప్రాజెక్టులో అవినీతి జరిగితే.ప్రభుత్వం ఇచ్చిన సొమ్మంతా దుర్వినియోగమైతే. ఈ కార్యక్రమంలో సీనియర్ తెదేపా నాయకులు కొళ్ల అప్పలనాయుడు, విజయనగరం జిల్లా బీసీ పార్లమెంటరీ అధ్యక్షులు గురవాన నారాయనరావు, కిమిడి అశోక్ కుమార్, సీనియర్ తెదేపా నాయకులు పొట్టా చిట్టిబాబు,వంగా వెంకటరావు,చింత గుంటి రమణ , చింత గుంటి ఢిల్లీశ్వరరావు,టంకాల కన్నం నాయుడు, ఎస్ రమేష్ కుమార్, ,అప్పల రాజు, గోపాలరావు, సూరిబాబు, సూర్యారావు,రావి ఈశ్వరులు,పొన్నాడ భీమేశ్వర రావు,మంగం రమేష్, ఆర్ గరిపతి,నీలయ్య మాస్టర్, మజ్జి శ్రీను, జీటి నాయుడు, జయరాం, ధనుంజయ, బెజ్జి పురపు రవి,బి నారాయణరావు, ముగడ శ్రీను, మరిపి జగన్ మోహన్ రావు,జగదాంబ, వెంకటలక్ష్మి,అనసూయ తదితరాలు పాల్గొన్నారు.




# బరువు తగ్గించే రాగి అంబలితో ఎన్నో లాభాలు..!

**ధాన్యపు గింజలైన రాగుల్లో ఎన్నో రకాల పోషక పదార్థాలు ఉంటాయి. అవి మన శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే రాగులతో తయారు చేసే అంబలిని తాగడం వల్ల మనకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ప్రధానంగా బరువు తగ్గుతారు. ఇంకా చాలా లాభాలే ఉన్నాయి. ఈ క్రమంలో రాగి అంబలిని ఎలా తయారు చేయాలో, దాంతో మనకు ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం.**



రాగులను కొంత పరిమాణంలో తీసుకుని వాటిని కొన్ని గంటల పాటు నీటిలో నానబెట్టాలి. అనంతరం వాటిని శుభ్రమైన వస్త్రంలో కట్టి మళ్లీ కొన్ని గంటల పాటు ఉంచితే అవి మొలకెత్తుతాయి. కొన్ని సార్లు రాగులు మొలకెత్తడం ఆలస్యం కూడా అవచ్చు. అయినా కొంత సేపు నిరీక్షించి మొలకెత్తిన రాగులను సేకరించాలి. వాటిని బాగా ఎండబెట్టి దంచి పొడి చేయాలి. ఆ పొడిని కొంత నీటిలో వేసి బాగా ఉడికించాలి. దీంతో జావ తయారవుతుంది. ఇందులో అవసరం అయితే జీడిపప్పు, పల్లీలు, కిస్మిస్, తేనె వంటివి కలుపుకోవచ్చు. లేదంటే ఉప్పు, కారం కూడా కలపవచ్చు. అలా కలుపగా వచ్చేదే రాగి అంబలి. దీన్ని నిత్యం తాగితే మన శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది.

1. రాగి అంబలి శరీరానికి మంచి బలాన్ని ఇస్తుంది. రోజంతా శరీరానికి కావల్సిన శక్తి, పోషకాలు రాగి అంబలి ద్వారా అందుతాయి. దీంతో ఎక్కువ సేపు పనిచేయవచ్చు. రోజంతా ఉత్సాహంగా ఉంటుంది.

2. ఎదిగే పిల్లలకు దీనిని ఇవ్వడం వల్ల శక్తివంతంగా తయారవుతారు. చదువుల్లో బాగా ప్రతిభను కనబరుస్తారు. మెదడు చురుగ్గా ఉంటుంది.

3. రాగి అంబలికి చలువ చేసే గుణం ఉంది. దీంతో శరీరంలో ఉండే అధిక వేడిని తగ్గించుకోవచ్చు.

4. ఒక గ్లాస్ రాగి అంబలి తాగినా చాలా సేపు ఆకలి వేయదు. దీంతో కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆహారం ఎక్కువగా తినాలనిపించదు. ఇది బరువు తగ్గాలనుకునే వారికి మేలు చేస్తుంది. స్థూలకాయం ఉన్న వారు రాగి అంబలి తాగితే వేగంగా బరువు తగ్గవచ్చు.

5. ప్రతి రోజూ ఉదయం చేసే సాధారణ అల్పాహారానికి బదులుగా రాగి అంబలి తాగితే దాంతో మనం రోజంతా యాక్టివ్‌గా ఉండవచ్చు. శారీరక ద ృఢత్వం చేకూరుతుంది.

6. బీపీ, షుగర్ నియంత్రణలోకి వస్తాయి. రక్తస్రావం జరుగుతున్న వారికి రాగి అంబలి తాగిస్తే స్రావం ఆగిపోతుంది.

7. రాగి అంబలిని నిత్యం తాగుతుంటే పురుషుల్లో వీర్యం వ ృద్ధి చెందుతుంది.

# అనారోగ్య సమస్యలను మటుమాయం చేసే నువ్వుల నూనె...



**ఇప్పుడంటే అన్నీ రిఫైన్డ్ నూనెలు వచ్చాయి కానీ ఒకప్పుడు మన వాళ్లు గానుగల్లో ఆడించిన నూనెలనే ఎక్కువగా వాడేవారు. అలాంటి నూనెల్లో నువ్వుల నూనె కూడా ఒకటి. తెల్లనివి, నల్లనివి అని రెండు రకాలుగా ఈ నువ్వులు ఉంటాయి. వీటి నుంచి తీసే నూనెలో ఎన్నో రకాల పోషక పదార్థాలు ఉంటాయి. మన శరీరానికి అవసరమైన విటమిన్ ఇ, కాల్షియం, జింక్, ఐరన్, థయామిన్, ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు, ప్రోటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు నువ్వుల నూనెలో మనకు పుష్కలంగా లభిస్తాయి. ఈ క్రమంలో నువ్వుల నూనెను నిత్యం మన ఆహారంలో భాగం చేసుకుంటే కలిగే ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.**

1. నువ్వుల నూనెలో విటమిన్ ఇ, బిలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి చర్మాన్ని సంరక్షించడమే కాదు, అన్ని రకాల చర్మ సమస్యలను దూరం చేస్తాయి. నువ్వుల నూనెను తరచూ వాడడం వల్ల ముఖం కాంతివంతమవుతుంది. చర్మం మ ృదువుగా మారుతుంది.

2. నిత్యం స్నానం చేసే ముందు చిన్న పిల్లలకు నువ్వుల నూనెతో మర్దనా చేస్తే వారి శరీరం బాగా ఎదుగుతుంది. మెదడు పదునుగా మారుతుంది. చిన్నారుల్లో ఉండే కొవ్వు కరిగిపోతుంది. ఈ నూనెలో ఉండే పోషకాలన్నీ పిల్లలకు లభిస్తాయి. అయితే పెద్దలు కూడా స్నానానికి ముందు నువ్వుల నూనెతో మర్దనా చేసుకోవచ్చు.

3. నువ్వుల నూనెలో ఒమెగా-3,6 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి బీపీని తగ్గిస్తాయి. శరీరంలో పేరుకుపోయిన కొలెస్ట్రాల్ నిల్వలను తగ్గిస్తాయి.

4. కాపర్, ఇతర పవర్‌ఫుల్ యాంటీ ఆక్సిడెంట్లు నువ్వుల నూనెలో ఉంటాయి. దీంతో ఇవి కీళ్ల నొప్పులను తగ్గిస్తాయి.

కొద్దిగా నువ్వుల నూనెను తీసుకుని కొంచెం వేడి చేసి మోకాళ్లపై రాసుకుంటే నొప్పులు, వాపులు తగ్గిపోతాయి.

5. పైన చెప్పిన విధంగా నువ్వుల నూనెను శరీరంపై కొవ్వు ఉన్న ప్రాంతాల్లో రాస్తే అధికంగా ఉన్న కొవ్వు కరిగిపోతుంది.

6. నువ్వుల నూనెలో ఉండే పోషకాలు ఎముకలకు ద ృఢత్వాన్ని ఇస్తాయి. రక్తనాళాలను శుభ్రం చేస్తాయి. శ్వాసకోశ సమస్యలను దూరం చేస్తాయి.

7. మధుమేహ వ్యాధి గ్రస్తులు నిత్యం 2 టేబుల్ స్పూన్ల మోతాదులో నువ్వుల నూనెను ఏవిధంగానైనా తీసుకుంటే వారి శరీరంలోని రక్తంలో ఉండే చక్కెర స్థాయిలు తగ్గుముఖం పడతాయి. దీని వల్ల షుగర్ నియంత్రణలో ఉంటుంది.

8. నువ్వుల నూనెతో తలకు మర్దనా చేస్తే జుట్టు బాగా పెరుగుతుంది. వెంట్రుకలు రాలడం తగ్గుతుంది. చుండ్రు సమస్య పోతుంది.

# చిన్నారుల్లో డిప్రెషన్



ఒకే ఇంట్లో ఉండే ఇద్దరు పిల్లల్లో ఒకరిని ఒకలా, మరొకరిని ఇంకోలా చూస్తే వారిలో ఆత్మ న్యూనతా భావం పెరుగుతుందని పరిశోధకులు అంటున్నారు. ముఖ్యంగా చిన్నతనంలో పిల్లల మధ్య వారి తెలివితేటల విషయంలో ఉన్న తేడా పట్ల తల్లిదండ్రులు ఎంత సమతూ కంతో వ్యవహరిస్తే అంత మంచిది. ఇలా వారి మధ్య ఉండే తేడాలను పదేపదే ప్రస్తావించి వారిపై మానసిక ఒత్తిడి తెస్తే మాత్రం ఆ భావన ఆ పిల్లల్లో పెరిగి తామెం దుకూ పనికిరామన్న ఆత్మ న్యూనతకు దారి తీస్తాయి. ఈ బీజాలను నాటేది వేరెవరో కాదు...స్వయానా తల్లిదండ్రులే. దాని వల్ల పిల్లలు పెద్దయ్యాక వారి మధ్య ప్రేమానురాగాలు పెంపొందడానికి బదులుగా ఈర్ష్య, అసూయలు వెల్లువెత్తుతాయి. ఇదే ఆత్మన్యూనతా భావంగా స్థిరపడుతుంది. ఈ ఆత్మన్యూనతా భావం అనేది ఒక వ్యక్తి జీవితంలో వారి చిన్నతనంలోనే తల్లిదండ్రులు ఇతర పెద్దల అజాగ్రత్తవల్ల, బాఎధ్యతా రహితమైన వ్యాఖ్యల వల్ల వారి మస్తిష్కంలో నాట బడ తాయి. దాని ప్రభావం మనిషి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసిగాని వదలదు. పెద్దలు పిల్లలను తోటి పిల్లలతో పోల్చి మాట్లాడడం లాంటి పొరపాటు చేస్తుంటారు. ఆ మాటలకు ఆ లేత హృదయాలు ఎంతగా గాయ పడతాయో చెప్ప లేము.

ఇక ఆడపిల్లలైతే రూపలావణ్యాలతో అక్కతో, చెల్లితో పోల్చి వారు బాధపడేలా చేస్తారు. రంగులో ఆ పిల్లలను పోల్చి బాల్యం లోనే నల్ల పిల్ల అని ముద్ర వేస్తారు. పొట్టివారైతే పొట్టిపిల్ల అని అంటూ ఆ భావన వారిలో కలిగేలా చేస్తారు. ఇలాంటి మాటల వల్ల ఆ పిల్లల్లో ఆత్మన్యూనతాభావం క్రమంగా పెరిగి బాధను ఎవరికీ చెపలేక తమలో తామే కుంగిపోతుంటారు.

# ఆహారంతో ఆరోగ్యం



ఆహారంలో ప్రొటీన్లు తక్కువగా ఉంటే ఆకలి ఎక్కువగా అవుతుంది. 20 శాతం ప్రొటీన్లు ఉన్న భోజనం చేసే వారితో పోలిస్తే 15 శాతం ప్రొటీన్లు ఉన్న భోజనం తీసుకునే వారు ఒక రోజులో 260 క్యాలరీలు ఎక్కువగా తీసుకుంటారు. 70 శాతం అదనపు క్యాలరీలు మనం రోజూ తినే చిరు తిండ్లతోనే సమకూరుతుంది. సంవత్సరం గడిచే సరికి సుమారు ఐదు నుంచి ఎనిమిది కిలోల బరువు కూడా పెరుగుతాము. దీన్ని నివారించాలంటే మాంసం, చేపలు, కోడిగుడ్ల వంటి ఆహారాన్ని సాధారణంగా తీసుకునే దాని కన్నా ఎక్కువగా తీసుకోవాలి. మనం తీసుకునే ఆహారంలో ప్రొటీన్ల నిష్పత్తి తగ్గితే ఆకలి పెరుగుతుంది. తద్వారా ఇంకా తింటాం. దీంతో శరీరంలో కెలరీలు విపరీతంగా పెరిగిపోయాయి. ఆహారాన్ని స్వీకరించడంలో సమతుల్యత, వైవిధ్యం, మితంగా వ్యవహరించడం అనేవి ఆరోగ్యకరమైన అలవాటు. అలా అని ఒకేసారి తినేదాని కంటే అధికంగా పట్టించినా ఇబ్బందే. ఒక్కసారే ఎక్కువ మొత్తంలో తినేకంటే రోజులో ఎక్కువసార్లు కొద్దికొద్దిగా తినడమే ఆరోగ్యకరమని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ క్యాలరీలు పొందకుండా, ఒకే దానిని అతిగా స్వీకరించకుండా అనేక రకాలు ఆహార పదార్థాలను కొంచెంగా తీసుకోవడం మంచిది. పోషక పదార్థాలు అధికంగా ఉండే వివిధ రకాల ఆహార పదార్థాలను తీసుకోండి. ఈ లెక్కన మంచి ఆరోగ్యం కోసం వైవిధ్యమైన 30 నుంచి 35 రకాల పోషక పదార్థాలను తీసుకోవాల్సి ఉంటుంది. ఏ ఒక్క ఆహారం కూడా అన్నింటినీ అందించదు. మీ దినసరి ఆహార ఎంపికలో పప్పు ధాన్యాలతో చేసిన పదార్థాలు, పండ్లు, కూరగాయలు, పాల పదార్థాలు, మాంసం, చేపలు ఉండేలా చూసుకోవాలి.

దీని కోసం టైం టేబుల్‌ను తయారు చేసుకుని దాన్ని పాటించాలి. రోజు ఎన్ని కెలరీలను ఖర్చు చేయగలమో అంత మోతాదులోనే ఆహారం తీసుకోవాలి. ధాన్యాలు, పండ్లు, పప్పులు, కూరగాయలను అధికంగా తీసుకోండి. పచ్చి కూరగాయలు తీసుకుంటే పోషకాలు నేరుగా అందుతాయి. అన్నంలో, చపాతీల్లో కూర ఎక్కువ తినాలి. రోజు ఎంత తినాలి? అనే విషయంలో మన చేసే పని, ఎత్తు, ప్రస్తుత బరువు, వయస్సు, స్త్రీ, పురుషుడు ఇలా పలు లక్షణాలను అంచనా వేయాల్సి ఉంటుంది.

అధిక బరువు శరీరానికి చేటు చేస్తుంది. ఎత్తుకు సరిపోయేలా బరువు వుంటే చాలు. ఈ విషయంలో వైద్యుడిని సంప్రదించి సలహా తీసుకోండి. మితాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు. ఆహారాన్ని తీసుకోవడంలోనూ సమయపాలన తప్పనిసరి.

# మహిమాన్వితం.. శివగంగ ఆలయం



పద్మాకారంలో ఆలయం. కింద గం గమ్మ.. మధ్యన రాజరాజేశ్వరి మాత..ఆ పైన త్రినేత్రుడు కొలువుదీరిన మహాదుతేమైన చోటు. చుట్టూ పద్మరేకుల్లా చిన్నచిన్న శివాలయాలు.., రావి, వేప, మేడి చెట్లు అల్లుకొని త్రివ ృక్షమై బాసిల్లుతున్న ప్రాంతం..అదే మహేశ్వరంలోని శివగంగ రాజరాజేశ్వరస్వామి ఆలయం. కాకతీయుల కాలంలో నిర్మాణమైన ఈ ఆల యం దినదినాభివ ృద్ధి చెందుతూ..భక్తుల కొంగుబంగారమై అలలారుతోంది. ఈకోవెల 6తేదీ నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. -మహేశ్వరం

కాకతీయుల కాలంలో రాజరాజేశ్వరస్వామి ఆలయం నెలకొల్పడంతో ఈ గ్రామానికి మహేశ్వరం అని పేరు వచ్చింది. శివగంగలో కొలువుదీరిన ఈ ఆలయం సందర్శకులను ఇట్టె కట్టిపడేస్తుంది. ఈ ఆలయ నిర్మాణం పద్మాకారంలో ఉంటుంది. దీనిచుట్టూ శ్రీహరిహరేశ్వరుడు, శ్రీమల్లీశ్వరుడు, శ్రీఅవిముక్తేశ్వరుడు, శ్రీఅఘోరేశ్వరుడు, శ్రీఅమరేశ్వరుడు, శ్రీఅమ ృతేశ్వరుడు, శ్రీగంగాధేశ్వరుడు, శ్రీఇష్టకామేశ్వరుడు, శ్రీముకేశ్వరుడు, శ్రీకాళహస్తీశ్వరుడు, శ్రీఏకాంబేశ్వరుడు, శ్రీమణికరి?కేశ్వరుడు, శ్రీమహానందీశ్వరుడు, శ్రీఅమరావతీశ్వరుడు, శ్రీకాశీపతీశ్వరుడు, శ్రీమంగళగౌరీశ్వరుడు ఆలయాలు పదరేకుల్లా ఉంటాయి.

ఆలయంలోని అష్టాదశంగా (18 సంఖ్య వచ్చేలా) నిర్మించడం విశేషం. సహాజంగా శివుడి తలపై గంగ ఉంటుంది. ఇక్కడ మాత్రం గంగలోనే శివుడు ఉండడంతో ఆయన కింది భాగంలోనే రాజేశ్వరీ దేవి విగ్రహాన్ని ప్రతిష‘ంచారు. ఈ శివగంగలో స్నానమాచరిస్తే వారి దోషాలు పోతాయని భక్తుల నమ్మకం.

**చరిత్రకు నిలువుటద్దం గడికోట**

కాకతీయుల కాలం నాటి చరిత్రకు నిలువుటద్దంగా ఆలయం పక్కనే గడికోట నిర్మాణం నేటికీ నిలిచి ఉంది. కొంత శిథిలావస్థకు చేరినప్పటికీ కోటలోని కట్టడాలు నేటికి సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. గడికోట చుట్టూ ఆర్చ్‌లతో పాటు మధ్యలో ఉన్న కొలను ను అదుతేంగా నిర్మించారు.

**మహత్యం..త్రివ ృక్షం...:**

ఆలయం ముందున్న చెట్టుకు ఓ చరిత్ర ఉంది. రావి, వేప, మేడి చెట్లు ఒకేచోట పెరగడంతో దీన్ని తివ ృక్ష చెట్టుగా పిలుస్తారు. పిల్లలు కానివారు ఈ చెట్లకు కొత్త కొబ్బరికాయ కట్టితే పిల్లలు పుడుతారని నమ్మకం. ఈవ ృక్షం కిందనే నాగేంద్రాలయం ఉంది.


**శివగంగకు దారి ఇలా..:**

ఆలయం హైదరాబాద్ నుంచి 25 కిలో మీటర్లు దూరంలో ఉంటుంది. ఫలక్‌నుమా, మిధాని, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్ డిపోల నుంచి బస్సు సౌకర్యం ఉంది. జూబ్లీబస్ స్టేషన్ నుంచి మహేశ్వరానికి 253/ 90కె, చార్మినార్ నుంచి 253 ఎం, 253 కె, 253 టి, 253 హెచ్, సికింద్రాబాద్ నుంచి 8ఎ/ 253ఎం. జూబ్లీహిల్స్ నుంచి 253 ఎం, బస్సులు ఎక్కాలి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కొండాపూర్ ప్రాంతాల నుంచి వచ్చే వారు ఔటర్‌రింగ్ రోడ్డు మీది నుంచి తుక్కుగూడ వరకు వచ్చి శ్రీశైలం రహదారి మీదుగా మహేశ్వరం గేట్ కమాన్ నుంచి ఆలయానికి చేరుకోవచ్చు.

**ఆలయ చరిత్ర...**

తానీషా నవాబుల వద్ద పని చేసిన అక్కన్న మాదన్నలు 1672లో వారి పర్యటనలో భాగంగా శిథిలావస్థలో ఉన్న ఈ ఆలయాన్ని పునరుద్ధరించారు. అప్పటి రాజధాని గోల్కొండ కోటకు పశ్చిమ భాగాన 37 కిలో మీటర్ల దూరంలో ఈ దేవాలయం ఉంది. శంషాబాద్ మండలంలోని చిన గోల్కొండ, పెద్ద గోల్కొండ గ్రామాల మీదుగా అక్కన్న ,మాదన్నలు ఇక్కడికి చేరుకునేవారట.

మహేశ్వరం ఆలయంతో పాటు సమీపంలోనే కోదండరామస్వామి ఆలయం, శివగంగ పుష్కరిణి, విషు? భగవాన్, ఆంజనేయస్వామి ఆలయాలను సైతం అక్కన్న మాదన్నలు నిర్మించినట్లు ప్రతీతి . ఎనిమిదేళ్ల కాలంలో వీటి నిర్మాణం పూర్తయినట్లు చరిత్ర చెబుతోంది. 1677లో ఈ ఆలయం పునర్‌నిర్మాణంలో ఉన్నప్పుడు శ్రీశైలం దర్శనానికి వెళ్లిన శివాజీ కూడా రాజరాజేశ్వరస్వామిని దర్శించుకొని వెళ్లినట్లు చరిత్ర చెబుతుంది. 1687లో ఔరంగజేబు దాడిలో గుడిని ధ్వంసమైనట్లు చెబుతుంటారు.



# వైభవోపేతంగా చక్రధారుడి చక్రస్నానం



తిరుమల, (విజయభాను న్యూస్) : శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం ఉదయం చక్రస్నానం వైభవంగా జరిగింది. విశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీవారి పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అంతకుముందు తెల్లవారుజామున 3 నుండి 6 గంటల వరకు స్వామివారికి పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. ఉదయం 6 నుంచి 9 గంటల నడుమ శ్రీ భూవరాహస్వామి ఆలయం ముఖ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపనతిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం, ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, రాజోపచారం నిర్వహించారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా పాలు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, గంధంతో స్నపనం నిర్వహించారు. వీటిని శంఖనిధి, పద్మనిధి, సహస్రధార, కుంభధారణలతో వైఖానస ఆగమయుక్తంగా స్నపనం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఉపనిషత్తు మంత్రములు, దశ శాంతి మంత్రములు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, విష్ణుసూక్తం వంటి పంచసూక్త మంత్రములు, దివ్యప్రబంధంలోని అభిషేక సమయంలో అనుసంధానము చేసే వేదాలను టీటీడీ వేదపారాయణదారులు పారాయణం చేశారు. అభిషేకానంతరం వివిధ పాశురాలను తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్‌స్వామి, తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్‌స్వామివారి శిష్యబృందం పఠించారు. ఈ వేడుకలో ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమ జాతి పుష్ప మాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ అర్చకం రామకృష్ణ దీక్షితులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

చక్రసన్నానం కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి దంపతులు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులు, ఈవో ధర్మారెడ్డి దంపతులు, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జెఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, సీవీఎస్వో నరసింహ కిషోర్, పలువురు ధర్మకర్తల మండలి సభ్యులు, ఇతర అధికార ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ధ్వజావరోహణం

చక్రస్నానం నాటి సాయంకాలం ధ్వజావరోహణం యథావిధిగా చేస్తారు. ఇంతటితో బ్రహ్మోత్సవయజ్ఞం మంగళాంతం అవుతుంది. ఎవరైతే బ్రహ్మోత్సవాలలో పాలు పంచుకొంటారో వారు సమస్త పాపవిముక్తులై, ధనధాన్య సమృద్ధితో తులతూగుతారు. విషమృత్యు నాశనం, రాజ్యపదవుల వంటి సకల ఐహిక శ్రేయస్సులు పొందుతారు. పరాంతకాలం వరకూ ఎటువంటి జనన, మరణ వికారములు లేకుండా సర్వలోకాలలో యథేచ్ఛగా విహరిస్తూ బ్రహ్మానందాన్ని పొంది శాశ్వతమైన విష్ణులోకాన్ని చేరుకొంటారు. ఇవాళ రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య బంగారు తిరుచ్చి ఉత్సవం జరుగనుంది. రాత్రి 9 నుంచి 10 గంటల మధ్య ధ్వజావరోహణంతో శ్రీ వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగియనున్నాయి.

# ముఖ్యమంత్రి జగన్ ను కలిసిన అవంతి



మధురవాడ (విజయభాను న్యూస్) : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్, అయన తనయుడు ముత్తంశెట్టి శివ నందీష్ మంగళవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డితో కాసేపు ముచ్చటించారు.

భీమిలిలో ఉన్న పలు సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లామని అయన సానుకూలంగా స్పందించారని అవంతి తెలిపారు.

# 41 ఏళ్ల తర్వాత తొలిసారి ఈక్వెస్ట్రియన్‌లో భారత్ బంగారు పతకం



దిల్లీ: ఆసియా క్రీడల్లో ఈక్వెస్ట్రియన్ విభాగంలో భారత్ బంగారు పతకం సాధించింది. 41 ఏళ్ల తర్వాత తొలిసారి ఈక్వెస్ట్రియన్‌లో భారత్ బంగారు పతకం కైవసం చేసుకోవడం గమనార్హం. సుదీప్తి హజెలా, హృదయ్ విపుల్, అనూష్ గార్వాలా, దివ్యకృతి సింగ్‌లతో కూడిన భారత బృందం ఈక్వెస్ట్రియన్‌లో డ్రస్సేజ్ ఈవెంట్‌లో గెలిచి పసిడి పతకాన్ని సొంతం చేసుకున్నారు. ఆసియా క్రీడల్లో ఈక్వెస్ట్రియన్ లో భారత్‌కి నాలుగో గోల్డ్ మెడల్. మిగిలిన మూడు బంగారు పతకాలు 1982 ఆసియా క్రీడల్లో గెల్చుకోవడం విశేషం. మరోవైపు, సెయిలింగ్‌లో భారత్ పతకాల వేట కొనసాగుతోంది. ఇప్పటికే సెయిలింగ్‌లో నేహా ఠాకూర్ రజత పతకం గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు సెయిలింగ్‌లోనే మరో రెండు పతకాలు భారత్ ఖాతాలో చేరాయి. పురుషుల విభాగంలో రెండు కాంస్య పతకాలు దక్కాయి. ఎబాద్ అలీ ఆర్ఎస్ – కేటగిరీలో, విష్ణు శరవణన్ ఐఎల్‌సీఏ విభాగంలో విష్ణు శరవణన్ కాంస్య పతకాలు సాధించారు

## ఎన్ ఆర్ ఐ మెడికల్ కాలేజ్ లో
# పేషెంట్ సేఫ్టీ వీక్



భీమునిపట్నం : విజయభాను న్యూస్ : రోగుల భద్రత విషయంలో రోగులతో పాటు వారి బంధువులకు కూడా సురక్షితంగా ఉండాలనే విషయాలపై అవగాహన కల్పించాలని ఎన్ ఆర్ ఐ మెడికల్ కాలేజ్ డీన్ డాక్టర్ పి.వి సుధాకర్ చెప్పారు. సంగివలస ఎన్ ఆర్‌ఐ మెడికల్ కాలేజ్ లో గత వారం రోజులుగా" రోగి భద్రత కోసం రోగులను ఎంగేజ్ చేయడం " అనే కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

ఇందులో భాగంగా రోగుల భద్రత పై రోగులు,వారి బంధువులు,వైద్యులు,ఇతర సిబ్బందికి అవగాహన కల్పించేందుకు నేషనల్ మెడికల్ కమీషన్ ఎయిర్ మార్షల్ డాక్టర్ ప్రవీణ్ కపూర్ ఆన్లైన్ ఈవెంట్ ను ఏర్పాటు చేసారు.రోగులకు ఆరోగ్య విషయంలో రక్షణ కల్పించడంలో వారి బాధ్యత ను విస్మరించకుండా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. బి.వి రత్న కుమారి,నర్సింగ్ సూపరింటెండెంట్ వి.ఎల్ ప్రియాంక,వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు,జూనియర్ వైద్యులు,నర్సింగ్,పారా మెడికల్ సిబ్బంది,అడ్మిన్ సిబ్బంది,క్వాలిటీ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# లింక్డెన్ ప్రీమియం సభ్యులుగా గీతం విద్యార్థులు



సాగర్‌నగర్ **(విజయభాను న్యూస్) :** ప్రపంచ ప్రఖ్యాత వృత్తినిపుణుల సమూహం లింక్డెన్ గీతం విద్యార్థులకు ఉచితంగా ప్రీమియం సభ్యత్వాన్ని ప్రకటించింది. దీనికి సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాన్ని మంగళవారం విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ బిజినెస్ లో విద్యార్థుల సమక్షంలో నిర్వహించారు. లింక్డెన్ గ్రోత్ పార్ట్‌నర్ షిప్ అధిపతి రాందాస్ కన్నన్ మాట్లాడుతూ ఉద్యోగ అవకాశాల అన్వేషణ, ఇంటర్న్ షిప్ లభించే సంస్థలు, నిపుణుల సలహాలు, సూచనలు పొందడం, ప్రపంచ వ్యాప్తంగా విలులైన సమాచారంతో అనుసంధానం చేయడంలో లింక్డెన్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. గీతం విద్యార్థులు తమ కెరీర్ ను ఉన్నతంగా తీర్చి దిద్దుకోవడానికి లింక్డెన్ ను వేధికగా ఉపయ్యోగించుకోవాలని సూచించారు. కార్యక్రమ కో ఆర్డినేటర్, గీతం కెరీర్ గైడెన్స్ సెల్ డిప్యూటీ డైరక్టర్ అనిల్ మాట్లాడుతూ లింక్డెన్ ద్వారా 2022–23 సంవత్సర కాలంలో 12 వేల మంది గీతం విద్యార్థులు సభ్యులుగా చేరారని, పరువురు గీతం విద్యార్థులు వివిధ దేశాలలో ప్రముఖ విశ్వవిద్యాలయాలలో ఇంటర్న్ షిప్ అవకాశాలు పొందారని తెలిపారు. కెరీర్ గైడెన్స్ మరియు మెంటారింగ్ విభాగం డైరక్టర్ ఉమాదేవి, కెరీర్ ఫుల్ ఫిల్ మెంట్ డైరక్టర్ సి.ఎ.శ్రీరామ్ మాట్లాడుతూ లింక్డెన్ ద్వారా ప్రపంచంలోని వివిధ రంగాల నిపుణులతో గీతం విద్యార్థులు అనుసంధానం కావాలని, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు.

# ఘనంగా ఉత్తర వై.సి.పి కార్యాలయం వద్ద అన్న సమారాదన కార్యక్రమం





సీతమ్మధార (విజయభాను న్యూస్) : విశాఖ ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గం సమన్వయకర్త రాష్ట్ర నెడ్ క్యాప్ ఛైర్మెన్ కె కె రాజు మరియు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన శ్రీ శ్రీ శ్రీ విజయ గణపతి నవరాత్రి మహోత్సవాలులో భాగంగా మంగళ వారం పార్టీ కార్యాలయం వద్ద మహా అన్నసమారాధన కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమంలో వీకేపీసీపీఐఏర్ ఛైర్మన్ చోక్కకుల లక్ష్మీ, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్,డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్ రాజు,,ఆళ్ల లీలావతి, వి.ప్రసాద్, కో–ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, ఉత్సవ కమిటీ సభ్యులు కిరణ్ రాజు, ఆళ్ల శివ గణేష్,అంబటి శైలేష్,రాజం రాజు,వార్డు అధ్యక్షులు నీలి రవి,కె.పి.రత్నాకర్ , JCS మండల కన్వీనర్లు అమర్ రెడ్డి,మురళిక్రిష్ణ రెడ్డి,రాష్ట్ర డైరెక్టర్లుపైడి శ్రీను,ప్రసాద్,, కోడూరి సుశీల, సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు & సభ్యులు, సచివాలయం కన్వీనర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# జి 20 సదస్సులో పాల్గొన్న ఏయూ విద్యార్థులు




ఆంధ్రవిశ్వవిద్యాలయం **(విజయభాను న్యూస్) :** దేశరాజధాని న్యూ ఢిల్లీలో జరుగుతున్న జి 20 యూనివర్సిటీ కనెక్ట్ ఫినాలే కార్యక్రమంలో ఏయూ నుంచి 22 మంది విద్యార్థులతో కూడిన బృందం పాల్గొంది. ప్రగతి మైదాన్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వీరంతా భాగస్వాముల య్యారు. ఏయూ రాజనీతి, ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జి.వీర్రాజుతో కూడిన విద్యార్థుల బృందం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏయూ నుంచి పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొనడం పట్ల నిర్వాహకులు అభినందనలు తెలియజేశారు.

# స్విమ్మింగ్‌లో జాతీయ రికార్డును బద్దలు కొట్టిన భారత్ జట్టు



బీజింగ్ : ఆసియా గేమ్స్‌లో భారత్ తన సత్తా చాటుతోంది. తాజాగా మంగళ వారం పురుషుల 4 100 మీటర్ల స్విమ్మింగ్‌లో మెడ్లీ బృందం జాతీయ రికార్డును బద్దలు కొట్టి ఫైనల్‌కు చేరింది. శ్రీహరి నటరాజ్, లిఖిత్ సెల్వరాజ్, సజన్ ప్రకాష్, తనీష్ జార్జ్ మాథ్యూలు 3 :44.84 నిమిషాల్లో పూర్తి చేశారు. జకార్తాలో జరిగిన గత ఆసియా గేమ్స్‌లో వారు నటరాజ్, సందీప్ సెజ్వాల్, ప్రకాష్, ఆరోన్ డిసౌజా నెలకొల్పిన 3:44.94 జాతీయ రికార్డును బద్దలు కొట్టి నూతన రికార్డును సృష్టించారు. బుధవారం ఫైనల్స్ జరగనున్నాయి.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⁎ Phone : 2564353, Fax : 0891-2569004 ⁎ e-mail: vijayabhanudaily@gmail.com